
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 1 ఆగస్టు 2024





హార్సిలీహిల్స్‌లో

క్రీడా శిక్షణ ఎప్పుడు..?

సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తు.. చుట్టూ పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలి.. ఇలాంటి వాతావరణంలో క్రీడలకు శిక్షణ ఇస్తే మంచి క్రీడాకారులు తయారవుతారనే ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వం ఇక్కడ క్రీడా శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించింది. నిధులు కూడా విడుదల చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి రావడంతో అది కాస్తా అటకెక్కింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, జిల్లాకు చెందిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి క్రీడా శాఖ మంత్రి కావడంతో నిధులు విడుదల చేసి క్రీడా శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

- వైసీపీ కబంధ హస్తాల్లోంచి మిగిలిన రూ.20 కోట్ల స్థలం
- హిల్స్ అభివృద్ధికి రూపాయి కూడా విదల్చని జగన్ సర్కార్
- టీడీపీ హయాంలో విడుదలైన రూ.3.20 కోట్లు
- కూటమి ప్రభుత్వం కనికరిస్తే.. జాతీయస్థాయిలో వెలుగు
- ఆశలన్నీ క్రీడా శాఖ మంత్రి మండిపల్లిపైనే..

బి.కొత్తకోట, జూలై 31: ఆంధ్రా ఊటీగా పిలువబడే ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌ను జాతీయ స్థాయిలో నిలపాలనే ప్రయత్నాలలో భాగంగా గత టీడీపీ ప్రభుత్వం, టౌన్‌షిప్ కమిటీతో కలిసి అనేక ప్రయత్నాలు చేసింది. దిగువ నుంచి హార్సిలీహిల్స్‌పైకి రోప్‌వే, కొండపైన ఒబెరాయ్ ఫైవ్‌స్టార్ హోటల్, అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడాకారులను తయారు చేయడానికి క్రీడాశిక్షణా కేంద్రం తదితర వాటి కోసం నిధులు, స్థలాల కేటాయింపు జరిగినప్పటికీ కొందరి స్వార్థం హార్సిలీహిల్స్ అభివృద్ధికి అడ్డంకిగా నిలిచింది. గత జగన్ సర్కారు హిల్స్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా విదిల్చక పోగా, కొండపై ఉన్న ఆస్తులను అస్మదీయులకు దోచిపెట్టేందుకు విఫలయత్నం చేసి విమర్శలను మూటగట్టుకుంది. వైసీపీ హయాంలో పర్యాటకశాఖ మంత్రిగా ఉన్న రోజా ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసి అయినా హార్సిలీహిల్స్ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం, నిధులు కేటాయించడం సంగతి అటుంచి కనీసం ఒక్కసారి కూడా పర్యటించకపోవడం కొసమెరుపు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో హిల్స్ అభివృద్ధిపై ముఖ్యంగా క్రీడా శిక్షణా కేంద్రంపై అందరి ఆశలు చిగురిస్తున్నాయి.

అంతర్జాతీయ క్రీడా శిక్షణా కేంద్రం కోసం...

సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తులో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో 108 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న హార్సిలీహిల్స్ బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పరిధిలో ఉంది. అనాదిగా బిల్డింగ్ సొసైటీ ఆధీనంలో ఉన్న కొండను ఆర్డీవో చైర్మన్‌గా వ్యవహరించే టౌన్‌షిప్ పరిధిలోకి తెచ్చారు. కొండపై ఏపీ టూరిజం, పోలీస్, రైల్వే, అటవీశాఖ, సిరికల్చర్, సీడీసీఎంఎస్ తదితర 15 విభాగాలకు భూమిని కేటాయించారు. అత్యంత ఎత్తులో మంచి వాతావరణం ఇక్కడ ఉండటంతో అంతర్జాతీయ స్థాయిలో ఖోఖో, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్ తదితర క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతో కొండపై క్రీడా శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం భావించింది. నిర్మాణం కోసం సర్వే నెంబరు 371-2లో 3.74 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. రూ.3.20 కోట్ల అంచనాతో క్రీడా శిక్షణా కేంద్రాన్ని మంజూరు చేసింది. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పనులు ప్రారంభమై స్థలాన్ని చదునుచేసి చుట్టూ ప్రహరీగోడను నిర్మించి సుమారు రూ.2 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఇంతలో వైసీపీ ప్రభుత్వం రావడంతో పనులు అటకెక్కాయి. ఇదే అదనుగా కొందరు కొంత స్థలాన్ని ఆక్రమించి చిన్నపాటి నిర్మాణాలు చేపట్టేశారు.



హార్సిలీహిల్స్‌పై క్రీడా శిక్షణా కేంద్రానికి కేటాయించిన స్థలం



రూ.కోటికి పైగా ఖర్చు చేసి నిర్మించిన ప్రహరీ

ఆ వివరాలు మా దగ్గర లేవు..

హార్సిలీహిల్స్‌లో క్రీడా శిక్షణా కేంద్రానికి సంబంధించిన వివరాలు మా దగ్గర లేవు. నేరుగా విజయవాడ కార్యాలయం నుంచే చూస్తున్నారు. ముందు చిత్తూరులో ఉండేవి. తర్వాత కడపకు మార్చారు. హార్సిలీహిల్స్‌కు ఏమి నిధులు వచ్చాయో, ఆ స్థలం తాజా పరిస్థితి ఏమిటో మాకు తెలియదు. మాకు దానిని అప్పజెపితే చూస్తాము.

- గౌస్‌బాషా, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్

రూ.20 కోట్ల స్థలం కొట్టేసేందుకు విఫలయత్నం..

వైసీపీ ప్రభుత్వం హార్సిలీహిల్స్ అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టకపోగా జగన్ కోసం యాత్ర-2 సినిమా నిర్మించిన దర్శకనిర్మాత మహీ వి.రాఘవకు హార్సిలీహిల్స్ క్రీడాశిక్షణా కేంద్రానికి కేటాయించిన 3.74 ఎకరాల్లోంచి 2 ఎకరాలను మినీ స్టూడియో నిర్మాణం ముసుగులో కట్టబెట్టాలని గట్టిగానే ప్రయత్నం చేసింది. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో ఆర్డీవో స్థాయి అధికారులే నేరుగా రంగంలోకి దిగి ఫైల్‌ను సిద్ధం చేసి పంపారు. విషయం బయటపడి పత్రికలు, మీడియా, ప్రజాసంఘాలు ఉద్యమించడంతో ఫైల్‌ను హోల్డ్‌లో పెట్టారు. అనంతరం ప్రభుత్వం మారడంతో ఆ విలువైన భూమి యథాప్రకారం శాప్‌కే మిగిలినట్లైంది.

మంత్రి దృష్టి పెడితే మహర్దశ..

జిల్లాకు చెందిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి క్రీడల శాఖ మంత్రిగా ఉండటం ప్రస్తుతం హార్సిలీహిల్స్‌కు కలిసివచ్చే అంశమని ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు. క్రీడా శిక్షణా కేంద్ర మిగులు నిధులను వినియోగించి క్రీడా సంబంధిత నిర్మాణాలు చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ చీఫ్ ఇంజనీరు పొడిగించిన గడువు కూడా ఈనెల 17తో ముగిసినట్లు సమాచారం. దీంతో పనులు చేపట్టేందుకు గడువును మరోసారి పెంచుతూ క్రీడా మంత్రిత్వ శాఖ ద్వారా స్పోర్ట్స్ అథారిటీ అధికారులకు ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది. అప్పటికి ఇప్పటికి అంచనాలలో తేడాలు ఉన్నందున మరిన్ని నిధులను కేటాయించి క్రీడా శిక్షణా కేంద్రం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకునేలా చూస్తే హార్సిలీహిల్స్ సిగలో మరో కలికితురాయి చేరినట్లు అవుతుంది. జాతీయ స్థాయిలో అన్నమయ్య జిల్లాకు గుర్తింపు వస్తుంది.



శిక్షణా కేంద్ర స్థలంలోనే నిర్మించిన టౌన్‌షిప్ కమిటీ కార్యాలయం

తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేద్దాం : డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, జూలై 31: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు వైద్యఆరోగ్యశాఖ, మహిళా స్త్రీ శిశు సంక్షేమశాఖ, విద్యాశాఖ, ఎస్ఈఆర్‌పీ శాఖల ఆధ్వర్యంలో కలిసికట్టుగా జరుపుకుంటున్నామన్నారు. మొదటి 6 నెలలు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడాన్ని ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాలనే లక్ష్యాన్ని సాధించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్ ప్రోత్సాహంతో నిర్వహిస్తున్నామన్నారు. ఆరోగ్యవంతమైన జీవితం లక్ష్యంగా తల్లిపాల ప్రోత్సాహం అనే నినాదంతో జరుపుకుంటున్న తల్లిపాల వారోత్సవాల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తల్లిపాలలో ప్రొటీన్‌లు, విటమిన్‌లు, ఐరన్ సమృద్ధిగా ఉండి రోగాలను ఎదుర్కొనే శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. ముర్రుపాలు బిడ్డకు సంజీవనిలాంటివని, ఇవి అమృతంతో సమానమని, ముర్రుపాలతో శిశువులు ఆరోగ్యంగా పెరుగుతారన్నారు. సీసా పాలు, పోతపాలు తాగే పిల్లల కన్నా తల్లిపాలు తాగే పిల్లలు ఎక్కువ బలంగా, ఆరోగ్యంగా, చురుకుగా, ఎక్కువ తెలివితేటలు కలిగి రోగాలను ఎదుర్కొనే శక్తి కలిగి ఉంటారన్నారు. కేవలం తల్లిపాలు మాత్రమే బిడ్డ శారీరక, మానసిక వికాసానికి అవసరమైన పోషణ ఇస్తాయని, పగలు, రాత్రి కలిసి బిడ్డకు కనీసం రోజుకు 8 నుంచి 10 సార్లు పాలు ఇవ్వాలని, నవజాత శిశువుకు తల్లిపాలు ప్రకృతి ఇచ్చిన వరమని తెలిపారు. తల్లిపాలు శిశువుకు ఇవ్వడం వలన తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుందని, 13 శాతం శిశు మరణాలు తగ్గించవచ్చని, ఆధునిక, విదేశీయుల మోజులో పడి ఫ్యాషన్‌లకు పోయి తల్లిపాలు బిడ్డలకు ఇవ్వకపోవడం చేయరాదన్నారు. ప్రతి ఒక్కరం తల్లిపాలను ప్రోత్సహిద్దాం ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం అని ఆయన జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లను వినియోగించుకోండి : డీఈవో



ఓపెన్ స్కూల్ పరీక్షల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డీఈవో, తదితరులు

రాయచోటిటౌన్, జూలై 31: ఆంధ్రప్రదేశ్ పదో తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని, నేటి నుంచి ఆగస్టు 27 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక డీఈవో కార్యాలయంలో ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజుతో కలిసి ఓపెన్ స్కూల్ నోటిఫికేషన్ విధి విధానాలకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రూ.200 అపరాధ రుసుంతో ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతిలో ప్రవేశానికి 14 సంవత్సరాలు నిండి ఉండాలని, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి పదో తరగతి పాసై 15 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలను ఏపీ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్‌బాబు, సూపరింటెండెంట్ రవికుమార్, జీసీడీవో రాధ, సీఎంవో కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించండి : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్..పక్కన మదనపల్లి, రాజంపేట, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియాదేవి

రాయచోటి(కలెక్టరేట్), జూలై 31: రోడ్డు ప్రమాదాలు తగ్గించి, మైనర్లు వాహనాలు నడపకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కళాశాలల్లో రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా బైకులు నడిపే యువత ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. 18 సంవత్సరాలు నిండని వారు బైకు నడిపితే వారిపై చలానా విధించడం కాకుండా కఠినచర్యలు తీసుకుని వారికి ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీవో భరత్‌చావన్ మాట్లాడుతూ జనవరి నుంచి జూన్ వరకు హిట్ అండ్ రన్ కేసులు, రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు, బ్లాక్‌స్పాట్స్‌పై తీసుకున్న చర్యల గురించి జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రమాదాల సంఖ్య బాగా తగ్గిందన్నారు. పట్టణంలో, జాతీయ రహదారులలో సాయంత్రం 6 నుంచి 10 గంటలలోపు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, మోటారు సైకిల్ వాహనాలే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయని, దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జేసీ పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌వో సత్యనారాయణ, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, రాజంపేట సబ్ కలెక్టర్ నిదియా దేవి, రాయచోటి ఆర్డీవో రంగస్వామి, మున్సిపల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష

- హత్యాయత్నానికి మరో ఏడేళ్లు...



యావజ్జీవశిక్ష పడిన ముద్దాయి సుబ్రమణ్యం

మదనపల్లె టౌన్, జూలై 31: ఓ వ్యక్తిని హత్య చేయడంతో పాటు మరో వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ముద్దాయికి మదనపల్లె రెండవ అదనపు జిల్లా జడ్జి బి.అబ్రహం బుధవారం యావజ్జీవ కారాగార శిక్షతో పాటు, మరో ఏడేళ్ల శిక్ష విధించారు. ఏపీపీ జయనారాయణరెడ్డి, టూటౌన్ సీఐ యువరాజు కథనం మేరకు.. 2016 సంవత్సరం ఆగస్టు 12వ తేదీ స్థానిక కదిరి రోడ్డులోని భాగ్యలక్ష్మి మిల్లులో వాచ్‌మ్యాన్ అల్లుడు అయిన వి.సుబ్రమణ్యం భార్యతో పాటు మామతో గొడవపడటమే కాక వారిద్దరిపై దాడి చేశాడు. ఈ క్రమంలో అదే మిల్లులో టైర్ల రీట్రేడింగ్ ఫ్యాక్టరీలో పనిచేసే కేరళకు చెందిన మణికంఠన్ (29), పి.రాజేష్‌లు వెళ్లి సుబ్రమణ్యంను అడ్డుకోవడంతో వారిద్దరిని సుబ్రమణ్యం కత్తితో దారుణంగా పొడిచాడు. ఈ ఘటనలో తీవ్రరక్తస్రావమైన మణికంఠన్ అక్కడికక్కడే మృతి చెందగా, గాయాలపాలైన రాజేష్‌ను తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందిన రాజేష్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ కేసును అప్పటి టూటౌన్ సీఐ దర్యాప్తు చేశారు. ఈ కేసు మదనపల్లె రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో విచారణ జరిగింది. కేసు పూర్వాపరాలు విచారించి, సాక్ష్యాధారాలు పరిశీలించి హత్య కేసులో సుబ్రమణ్యంకు యావజ్జీవ శిక్ష, రాజేష్‌పై హత్యాయత్నం చేసినందుకు మరో ఏడేళ్ల కారాగార శిక్ష విధిస్తూ జడ్జి అబ్రహం తీర్పు ఇచ్చారు.

వ్యక్తి దారుణ హత్య

- నిద్రిస్తుండగా తలపై నరికిన గుర్తు తెలియని వ్యక్తులు



రామచంద్ర (ఫైల్)

కలకడ, జూలై 31: పొలం వద్ద నిద్రిస్తున్న వ్యక్తి తలపై నరికి దారుణంగా హత్య చేసిన సంఘటన కలకడ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కదిరాయచెరువు గ్రామానికి చెందిన రామచంద్ర (45)కు వడ్డిపల్లెకు సమీపంలో వ్యవసాయ పొలం ఉంది. అక్కడే అతను రేకుల షెడ్ నిర్మించుకుని పాడి ఆవులను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాపలా నిమిత్తం పొలం వద్ద నిద్రించేందుకు కుమారుడు వినోద్ (7)ను వెంటబెట్టుకుని వెళ్లాడు. తండ్రీకొడుకు నిద్రలో ఉండగా అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తమ వెంట తెచ్చుకున్న ఆయుధాలతో రామచంద్ర తలపై నరికి పారిపోయారు. ఆ సమయంలో భయంతో కుమారుడు వినోద్ షెడ్‌లోపలికి వెళ్లి గడియపెట్టుకుని నిద్రపోయినట్లు తెలిపారు. బాలుడు ఉదయం నిద్రలేచి చనిపోయిన తండ్రిని చూసి సమాచారాన్ని తల్లికి తెలిపాడు. భార్య లలిత వచ్చి చూడగా భర్త రామచంద్ర రక్తపుమడుగులో పడి చనిపోయి ఉన్నాడు. సమాచారాన్ని తెలుసుకున్న కలకడ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామకృష్ణారెడ్డి, కేవీపల్లె ఎస్ఐ రహీముల్లా హత్య జరిగిన తీరును పరిశీలించి సమాచారాన్ని సేకరించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం రంగంలోకి దిగారు. కాగా కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోవడంతో రామచంద్ర భార్య లలిత, కుమార్తె పరంజ్యోతి, వినోద్‌కు భోరున విలపించారు. అనంతరం మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసులు

అక్కడ హిందువులదే పీర్ల పండుగ

- ఒక్క ముస్లిం కుటుంబం కూడా లేదు
- మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూడుపల్లె గ్రామం
- ప్రారంభమైన ఉత్సవాలు.. నేడు పీర్ల ఊరేగింపు



గూడుపల్లెలో ఏర్పాటు చేసిన పీర్లు

ములకలచెరువు, జూలై 31: అవును మీరు విన్నది నిజమే.. ఆ గ్రామంలో ఒక్క ముస్లిం కుటుంబం కూడా లేదు. అయినా పీర్ల పండగను వైభవంగా జరుపుకుంటున్నారు. అక్కడ ఉన్నది అందరూ హిందువులే. గ్రామం మొత్తం చూసినా ఒక్క ముస్లిం కూడా లేడు. సహజంగా పీర్ల పండగ (మొహరం)ను ముస్లింలు చేస్తుంటారు. కొన్ని చోట్ల హిందూ-ముస్లింలు కలిసి చేసుకుంటారు. పీర్ల పండగ ముస్లింలకు చెందిన పండగగా చెప్పుకుంటారు. అయితే ఇక్కడ మాత్రం మత సామరస్యానికి ప్రతీకగా హిందువులంతా కలిసి పీర్ల పండగను చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ములకలచెరువు మండలం గూడుపల్లెలో 200 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇది మారుమూల గ్రామం. ఇక్కడ అందరూ హిందువులే ఉన్నారు. ఒక్క ముస్లిం కుటుంబం కూడా లేదు. ఇలాంటి గ్రామంలో హిందువులందరూ కలిసి ప్రతి ఏడాది పీర్ల పండుగను వైభవంగా చేసుకుంటున్నారు. హిందువులే పీర్లను తయారు చేయించారు. పక్కగ్రామమైన కోనేటివారిపల్లె పంచాయతీ దాశెట్టివారిపల్లె నుంచి ముస్లిం మత గురువు హైదర్‌వలిని పిలిపించి పండుగను జరుపుకుంటున్నారు. ఈసారి కూడా పీర్ల పండుగను జరుపుకోవాలని గ్రామస్థులు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సోమవారం నుంచి పీర్ల పండుగను ప్రారంభించారు. గ్రామ చావిడిలో పీర్లను ఏర్పాటు చేశారు. హస్సేన్‌హుస్సేన్, మస్తాన్‌వలి, బారా ఇమామ్, బాదుల్లా సాహెబ్, ఫాతిమా, మౌలాలిసాహెబ్, షేక్షావలి తదితర పీర్లను నెలకొల్పారు. ముస్లింలే లేని గ్రామంలో పీర్ల పండుగను చేసుకుంటున్న హిందువులు పీర్లను ముస్లింల పేరుతో తయారు చేయించడం ఆదర్శంగా నిలుస్తోంది. పీర్లను ఏర్పాటు చేసే సమయంలో గ్రామస్థులంతా చావిడి వద్దకు చేరుకున్నారు. పీర్లను ఏర్పాటు చేసే చావిడి ముందు అగ్నిగుండం తవ్వారు. దాశెట్టివారిపల్లె నుంచి వచ్చిన మత గురువు హైదర్‌వలి పీర్లను ప్రతిష్ఠించారు. ఈ క్రమంలో గ్రామంలోని హిందువులు పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురు, శుక్రవారం పీర్లను పూలతో అలంకరించి గ్రామంలో ఘనంగా ఊరేగించనున్నారు. ఆగస్టు 4వ తేదీ జల్ది (పీర్లకు వీడ్కోలు) కార్యక్రమం జరగనుంది. హిందువులే పీర్లను ఏర్పాటు చేయడం...పీర్ల ముందు ప్రత్యేక ప్రార్థనలు చేయించడం, పీర్లను ఎత్తుకుని గ్రామంలో ఊరేగించడం...అగ్నిగుండం చుట్టూ ఎగరడం చూస్తుంటే మతసామరస్యం ఈ గ్రామంలో ఉట్టిపడుతోంది.



పీర్ల వద్ద గ్రామస్తులు



పీర్ల ముందు తవ్విన అగ్నిగుండం

మదనపల్లె డివిజన్‌లో 11 తహసీల్దార్ల పోస్టులు ఖాళీ

- నియామకం కోసం ఎదురుచూస్తున్న ప్రజలు
- ప్రజాప్రతినిధుల పైరవీల కోసం పాకులాట
- తేలు కుట్టిన దొంగల్లా కొందరు రెవెన్యూ అధికారులు



మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం

మదనపల్లె టౌన్, జూలై 31: మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో 11 మండలాలకు చెందిన తహసీల్దార్ల పోస్టులు గత శనివారం ఖాళీ అయ్యాయి. మూడు రోజులుగా డిప్యూటీ తహసీల్దార్లే ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలలోని 9 మండలాలతో పాటు పీలేరు నియోజకవర్గంలోని వాల్మీకిపురం, కలికిరి మండలాలు వస్తాయి. ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. వీరి స్థానంలో పక్క జిల్లాల నుంచి తహసీల్దార్లను నియమించారు. దీంతో పాటు ఆయా నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులుగా ఆర్డీవో స్థాయి అధికారులను నియమించారు. ఈ నియోజకవర్గాల పరిధిలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా తహసీల్దార్లు పనిచేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక కోడ్ అమలులో ఉండటంతో సంక్షేమ పథకాల మంజూరుకు బ్రేక్ పడింది. కేవలం ఎన్నికల విధులు మాత్రమే ఈ తహసీల్దార్లకు కేటాయించారు. ఈ క్రమంలో ఎన్నికలు పూర్తి కావడం, ఫలితాలు వచ్చి కొత్త ప్రభుత్వం ఏర్పాటై 48 రోజులు కావస్తుండటంతో రెవెన్యూ శాఖ తహసీల్దార్ల బదిలీలకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా గత శనివారం ఎన్నికల విధులకు వచ్చిన తహసీల్దార్లను వెంటనే రిలీవ్ కావాలని ఉత్తర్వులు జారీ చేసింది. వీరి స్థానంలో ఆయా తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్‌లను ఇన్‌చార్జిలుగా నియమించారు. కాగా గతంలో పనిచేసిన పాత తహసీల్దార్లను అదే మండలాలకు నియమించవద్దని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

పైరవీలకు కోసం పాకులాట

తహసీల్దార్ల బదిలీల ప్రక్రియలో రెండో దశ మరో వారం రోజుల్లో పూర్తి కానున్నట్లు సమాచారం. ఈ క్రమంలో చాలామంది తహసీల్దార్లు వారు కోరిన మండలాల్లో పోస్టింగ్‌ల కోసం అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రజాప్రతినిధులు కూడా అడిగిన వారికి అడిగినట్లు సిఫారసు చేయకుండా తహసీల్దార్ల పనితీరు, నిజాయితీని బేరీజు వేసుకుంటున్నట్లు సమాచారం. కొందరైతే ఇద్దరు ముగ్గురికి ఒకే లెటర్ ఇస్తూ మాకెందుకు ఈ తలనొప్పి అని తప్పించుకుని తిరుగుతున్నట్లు తెలిసింది.

తేలు కుట్టిన దొంగల్లా రెవెన్యూ అధికారులు

మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం జరగటం, ముఖ్యంగా 22(ఏ) భూములకు సంబంధించిన సెక్షన్ నుంచే మంటలు వ్యాపించినట్లు పోలీసు అధికారుల విచారణ తేలింది. ఈ క్రమంలో డివిజన్‌లోని పలు మండలాల నుంచి 22(ఏ) జాబితాలో ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తీసివేయడం వెనుక అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దీనిపై మదనపల్లెలోనే మూడు రోజుల పాటు తిష్ట వేసిన రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా అన్ని మండలాల నుంచి 22(ఏ) రన్నింగ్ ఫైళ్లు, గత ఆరు నెలలుగా ట్రాన్సాక్షన్ జరిగిన ఫైళ్లను ప్రత్యేక అధికారుల సమక్షంలో 11 మండలాల నుంచి మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌కు తెప్పించుకుని విచారణ చేపట్టారు. దీంట్లో 2023 డిసెంబరు నెల నుంచి ఎన్నికల ముందు బదిలీ అయ్యేంత వరకు వీఆర్‌వో స్థాయి నుంచి తహసీల్దార్ల వరకు నిబంధనలకు విరుద్ధంగా ఎవరు అక్రమాలు చేశారు.. ఎన్ని ఎకరాలు నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు సిఫారసు చేశారో అన్నది సిసోడియా నివేదికలో ఉన్నట్లు సమాచారం. ఇదే నిజమైతే ఏ అధికారిపై వేటుపడనుందో అని రెవెన్యూ అధికారులు తేలు కుట్టిన దొంగల్లా ఉన్నారు.

ప్రైవేటు అంబులెన్స్‌ల దోపిడీ

- ఆసుపత్రి వైద్యసిబ్బందితో కుమ్మక్కు
- సిబ్బందికి మందు, విందు, కమీషన్లతో ఎర
- అనుమతి లేకుండానే ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్
- రోగులను దోచుకుంటున్న అంబులెన్స్ మాఫియా

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 31: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రైవే టు అంబులెన్స్‌ల మాఫియాకు అడ్డాగా తయారయింది. వైద్య సిబ్బంది ప్రైవేటు అంబులెన్స్ వారితో కుమ్మక్కై రోగులను దోచుకుంటున్నారు. వైద్యం కోసం వచ్చే రోగులు డిశ్చార్జ్ అయినప్పుడు ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేసినప్పుడు లేదా రోగి మరణించినా అంబులెన్స్‌లను ఆశ్రయిస్తారు. ఈసమయంలో రోగుల నిస్సహాయతను ఆసరా చేసుకుంటున్న ప్రైవేటు అంబులెన్స్‌ల వాళ్లు ఇష్టానుసారం బాడుగలు వసూలు వస్తూ రోగులను దోచుకుంటున్నారు. ఇక రోగులకు సహాయ సహకారం అందించాల్సిన వైద్య సిబ్బంది అంబులెన్స్ యజమానులు ఇచ్చే కమిషన్లకు కక్కుర్తిపడి రోగుల జేబులకు చిల్లులు పడేలా వ్యవహరిస్తున్నారు.



ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్ చేసిన అంబులెన్స్‌లు



బాడుగల ధరల పట్టికను తొలగించిన దృశ్యం

రుయా సంఘటనతో మార్పు

రెండేళ్ల క్రితం 2022లో తిరుపతి రుయాలో జరిగిన సంఘటన రాష్ట్రంలో పెను దుమారం రేపింది. కేవలం 75 కి.మీకే రూ.20వేలు డిమాండ్ చేసిన ప్రైవేటు అంబులెన్స్‌లు. దీంతో బాలుడి శవాన్ని స్కూటరు మీదనే తీసుకెళ్లాడు బాలుడి తండ్రి. ఈ సంఘటనను సీరియస్‌గా తీసుకున్న అప్పటి ప్రభుత్వం ప్రైవేటు అంబులెన్స్‌లను ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులను తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా ధరలను నిర్ణయించింది. ధరల పట్టికను ప్రతి ఆసుపత్రి ప్రాంగణంలో రోగులకు తెలిసేలా బ్యానర్లను కట్టించింది. ఈ సంఘటనతో ఆసుపత్రి అధికారులు ప్రత్యేక చొరవ చూపారు. కానీ నేడు అందుకు పూర్తి భిన్నంగా తయారైంది పరిస్థితి.

మందు, విందు, కమీషన్లతో ఎర

ప్రైవేటు అంబులెన్స్‌ల వారు తమకే రెఫర్ చేయాలంటూ ఆసుపత్రిలో పనిచేస్తున్న కొంతమంది వైద్యసిబ్బందికి మందు, విందుతో పాటు 10 నుంచి 20 శాతం కమిషన్లు ఇస్తున్నారు. దీంతో వారు రోగులకు తమకు అనుకూల అంబులెన్స్ డ్రైవర్ల నెంబర్లు ఇస్తున్నారు. రోగులతో బేరం కుదిరాక అందులో నుంచి వైద్యసిబ్బందికి వెంటనే కమిషన్లు ఇస్తున్నారు. దీంతో ప్రైవేటు అంబులెన్స్‌ల వాళ్లు ఇష్టం వచ్చినట్లు బాడుగలు వసూలు చేస్తూ.. రోగులను దోచుకుంటున్నారు. ఇక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆవరణలో ప్రైవేటు అంబులెన్స్‌ల బాడుగలకు సంబంధించి ఏర్పాటు చేసిన ధరల పట్టికను తొలగించి వేశారు. దీంతో రోగుల బంధువులు బాడుగల విషయంలో అవగా హన లేక వాళ్లు ఎంత చెబితే అంత బాడుగ ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రైవేటు అంబులెన్స్‌ల పార్కింగ్‌కు అడ్డాగా...

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ప్రైవేటు అంబులెన్స్‌ల పార్కింగ్‌కు అడ్డాగా మలుచుకున్నారు. సాధారణంగా అంబులెన్స్‌లు ఆసుపత్రి బయట ఉండాలి. కానీ కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రైవేటు అంబులెన్స్‌లు యథేచ్ఛగా ఆసుపత్రి ఆవరణలో, లోపల యథేచ్ఛగా పార్కింగ్ చేస్తారు. ఇందుకు ప్రధానంగా వైద్యసిబ్బందే కారణం అని చెప్పవచ్చు. అంబులెన్స్ వారు మందు, కమిషన్ ఇచ్చి సిబ్బందిని తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటున్నారు.

వారిలో వారికే.. కుమ్ములాటలు

ప్రైవేటు అంబులెన్స్‌ల యజమానులు వైద్యసిబ్బందికి కమిషన్లను ఇచ్చి... వారి ఇష్టం వచ్చినట్లు బాడుగలు తీసుకుంటూ రోగులను దోచుకుంటున్నారు. అయితే ఈ విషయంలో వారిలో వారికే కుమ్ములాటలు మొదలయ్యాయి. ఒకే వ్యక్తికి సంబంధించి అయిదు నుంచి ఆరు అంబులెన్స్‌లు ఉండడం, అతను వైద్యసిబ్బంది అవసరాలు తీర్చి కమిషన్లు అధికంగా ఇవ్వడంతో బాడుగలన్నీ అతనికే చెబుతున్నారు. దీంతో మిగిలిన అంబులెన్స్‌ల వారికి బాడుగలు లేక అసహనానికి గురవుతున్నారు. దీంతో వాళ్లు తమ వాహనాలకు బాడుగలు లేక ఈఎంఐలు కట్టలేక, ఇళ్లు గడవక వారిలో వారే గొడవలు పడుతున్న సంఘటనలున్నాయి.

ధరల పట్టిక మళ్లీ ఏర్పాటు చేస్తాం



అంబులెన్స్‌ల బాడుగలకు సంబంధించి ధరల పట్టికను ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేశాం. అది పాడైపోవడంతో కొత్తది ఏర్పాటు చేస్తాం. అంబులెన్స్‌లు ఆసుపత్రి ప్రాంగణంలో పార్కింగ్ చేయకుండా చేస్తాం. కొందరు వైద్య సిబ్బంది కమీషన్లు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఎవరూ ఫిర్యాదు చేయడం లేదు. ఫిర్యాదు అందితే సిబ్బందిపై చర్య లు తీసుకుంటాం. రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

- డాక్టర్ శ్రీనివాసులు,
సీఎస్ఆర్ఎంఓ సర్వజన ఆసుపత్రి, కడప

షార్ ఉద్యోగి మృతికి ఎమ్మెల్యే సంతాపం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డి

చిట్వేలి, జూలై 31: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షార్ ఉద్యోగి నరేంద్ర(39) మృతదేహం బుధవారం ఆయన స్వస్థలమైన చిట్వేలి మండలం వెంకటరాజుపల్లెకు తీసుకురావడంతో బుధవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా సాయివికాస్ రెడ్డి, కూటమి నేతలు నరేంద్ర తదితరులు సందర్శించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు తమ సంతాపం వ్యక్తం చేశారు. సహ ఉద్యోగి పదవీ విరమణ సందర్భంగా గిఫ్ట్ తీసుకోవడానికి సూళ్లూరుపేట వెళ్లిన ఆయన పిండిపాలెం క్రాస్‌వద్ద మంగళవారం మధ్యా హ్నం సమయంలో ద్విచక్ర వాహనంపై లారీని ఢీకొన్న ఘటనలో నరేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. అతని జేబులో ఉన్న ఆధార్‌కార్డు, లైసెన్సు ఆధారంగా పోలీసులు అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం వెంకటరాజుపల్లె వాసిగా గుర్తించి వివరాలు తెలిపారన్నారు.

మోటర్ల వైరు చోరీ

కొండాపురం, జూలై 31: మండలంలోని పొట్టిపాడు సమీపంలోని చిత్రావతి నదిలో బాలాంజనేయులు అనే రైతుతో పాటు మరో ఐదుగురికి చెందిన మోటర్ల నుంచి స్టార్టర్లకు వెళ్లే వైరు బుధవారం రాత్రి చోరీకి గురైంది. గురువారం ఉదయం మోటర్లు ఆన్ చేయడానికి వెళ్లినప్పుడు చోరీ విషయం గుర్తించినట్లు వారు తెలిపారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు తీవ్రగాయాలు



విద్యార్థులను పరామర్శిస్తున్న బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు, జూలై 31: పాఠశాల ఆవరణలో నిలువ ఉంచిన విద్యుత్ స్తంభాల వద్ద ఆడుకుంటుండగా అవి దొర్లి పడడంతో ఐదుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. 24 గంటల విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల్లో భాగంగా విద్యుత్ అధికారులు మండలంలోని కామసముద్రం ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్తంభాలను నిలువ చేశారు. పాఠశాల విరామ సమయంలో విద్యార్థులు వాటిపైకి ఎక్కడంతో అవి దొర్లిపడ్డాయి. దీంతో స్రవంతి (10) కాలు విరగగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం అందించడంతో అట్లూరు ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని 108 వాహనంలో విద్యార్థులను రిమ్స్‌కు తరలించారు. బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ రిమ్స్‌కు వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. పిల్లల తల్లిదండ్రులు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

బద్వేలుటౌన్, జులై 31: ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఫొటో గ్రాఫర్ చాపర్లి వెంకటయ్య (47) బుధవారం మృతి చెందారు. మంగళవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఈ రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. మృతుడికి భార్య వెంకట కళ్యాణి, కూతురు నవ్యశ్రీ ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కళాకారుడు మృతి

మైదుకూరు రూరల్ జూలై 31 : బుర్రకథ, జానపద కళల్లో రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీత బండారు ఆంజనేయులు గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మైదుకూరు మండలంలోని ఉత్సలవరం గ్రామానికి చెందిన ఆంజనేయులు ఎన్‌టీఆర్ అభిమాని. గండికోట ఉత్సవాలు, ఉగాది పురస్కారాలు, కృష్ణా పుష్కరాలు, పిచ్చిగుంట్ల కళోత్సవాల్లో పలు అవార్డులను సొంతం చేసుకొన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఆంజనేయులు మృతి కళామతల్లికే కాకుండా టీడీపీకి కూడా తీరని లోటు అని మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ కొనియాడారు. ఆయన మృతికి సంతాపం తెలిపి, వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

లారీ డ్రైవరుకు జైలు శిక్ష

సికెదిన్నె, జూలై 31: మద్యం సేవించి వాహనం నడిపినందుకు విజయ్‌చంద్రన్ అనే వ్యక్తికి పది రోజులు జైలు శిక్ష విధించినట్లు సికె దిన్నె ఎస్ఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. ఈ నెల 30న మద్యం సేవించి లారీ నడుపుతుండగా ఎంవీఐ విజయభాస్కర్ బ్రీత్ అనలైజర్ పరీక్ష చేయడంతో పట్టుబడ్డాడు. అతనిని పోలీసులకు అప్పగించగా, నిందితుడికి పది రోజులు జైలు శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ ఫస్ట్ స్పెషల్ జేఎఫ్‌సీఎం కోర్టు తీర్పు నిచ్చినట్లు ఆయన వివరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సిద్దవటం, జూలై 31: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి 10 వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ నాగరాజు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా నేరమన్నారు. ఎస్.రాజంపేట, సిద్దవటం, గాండ్లపాలెం, కమ్మపాలెం, దర్జీపల్లె, పెన్నానది పరివాహ ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా స్పెషల్ టీం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

తల్లిపాలు పిల్లలకు పౌష్టికాహారం : జేసీ

రాయచోటి(కలెక్టరేట్), జూలై 31: పుట్టిన పిల్లలకు తల్లి పాలు పౌష్టికాహారం అని జాయింట్ కలెక్టర్ అదర్శ రాజేంద్రన్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లో తల్లి పాలు బిడ్డకు ఆరోగ్యం అనే పోస్టర్‌ను తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. బిడ్డ జన్మించిన మొదటి గంటలోపు తల్లి పాలు అమృతం లాంటివని, వీటి ద్వారా బిడ్డకు అతి ముఖ్యమైన పోషకాలు అందుతాయని తెలిపారు. పుట్టిన పిల్లలకు సంపూర్ణపోషణ, మానసిక వికాసం తల్లి పాలతోనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కొండయ్య, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న జేసీ, సబ్‌కలెక్టర్లు

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద జాయింట్ కలెక్టర్, మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్‌లు ముగ్గురు విద్యార్థులకు స్కాలర్‌షిప్ సర్టిఫికెట్లు అందించారు. క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ కార్పొరేట్ బాధ్యతలో భాగంగా అన్నమయ్య జిల్లాకు చెందిన ముగ్గురు పదవ తరగతి విద్యార్థులకు అధిక మార్కులు సాధించినందుకు.. ఒక్కొక్కరికి రూ.15 వేలు స్కాలర్‌షిప్ వారి బ్యాంక్ ఖాతలో జమ చేసినటు సీఏజీఎల్ సంస్థ డివిజనల్ మేనేజర్ జగదీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం కలిగి ఉండాలి: సబ్ కలెక్టర్

రాజంపేటటౌన్, జూలై 31: విద్యార్థులు పోటీతత్వం కలిగి ఉండాలని సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవి సూచించారు. బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రముఖ హిందీ రచయిత మున్షీ ప్రేమ్‌చంద్ జయంతి సందర్భంగా హిందీ వ్యాసరచన పోటీ విజేతలకు ఆమె బహుమతులను అందజేశారు. ప్రేమ్‌చంద్ హిందీభవన్ సొసైటీ ఆధ్వర్యంలో జూలై 28వ తేదీన ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడ ఏ పోటీలు జరిగినా అందులో పాల్గొనడం విద్యార్థులకు ఉండాల్సిన ముఖ్య లక్షణం అన్నారు. హిందీ వ్యాసరచనలో మొదటి బహుమతి ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని భరణి, ద్వితీయ బహుమతి బీవీఎన్ విద్యార్థిని సాదియా, తృతీయ బహుమతి మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గీతిక అందుకున్నారు. సంస్థ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్, హిందీ ఉపాధ్యాయులు చాంద్‌బాషా, రాజశేఖర్, అల్లాబకస్‌లు తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ నిధియాదేవి చేతులమీదుగా బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

మీ సేవలు చిరస్మరణీయం

- అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్



పదవీ విరమణ సన్మానం అందుకుంటున్న కొండారెడ్డి, సీవీ రమణ

కడప (క్రైం), జూలై 31 : దాదాపు 35 ఏళ్ల పాటు అంకితభావంతో పోలీసు శాఖకు అందించిన సేవలు శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ మినీ కాన్ఫరెన్స్ హాలులో జూలై 31న పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను ఆయన ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి, నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు పోలీసుశాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ ఏవో జ్యోతి, ఆర్ఐ టైటస్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కడప(కలెక్టరేట్) జూలై 31: పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి చేరిన యువకుల మృతదేహాలను వైద్యులు , సిబ్బంది ఇష్టానుసారంగా కోశారని, సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రొద్దుటూరుకు చెందిన టీడీపీ నేత మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్మన్ ముక్తియార్ బుధవారం కలెక్టర్ శివశంకర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ డ్యాంలో మునిగి చనిపోయిన ఆ యువకులు పేద కుటుంబాలకు చెందిన వారని, ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూడాలని కోరామన్నారు. ప్రభుత్వాసుపత్రులకు వచ్చే వారితో అగౌరవంగా వ్యవహరించడం తగదని, సేవాభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. పోస్టుమార్టంలో కూడా బంధువులు, కుటుంబ సభ్యులు బాధ పడేలా శవాలను కోయడం బాధ కల్గించిందని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలనీ కలెక్టర్‌కు విన్నవించామన్నారు.

ఆర్కిటెక్చర్, వైవీయూ వీసీల భేటీ



చర్చించుకుంటున్న వైవీయూ, ఆర్కిటెక్చర్ యూనివర్సిటీల వైస్‌చాన్సలర్‌లు

కడప (ఎడ్యుకేషన్), జూలై 31 : వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథ కుమార్ భేటీ అయ్యారు. బుధవారం ప్రొఫెసరు విశ్వనాథకుమార్ తొలిసారిగా వైవీయూను సందర్శించారు. ఇరువురు వీసీలు కలిసి విశ్వవిద్యాలయ అభివృద్ధిపై చర్చించారు. యూనివర్సిటీ ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, ఆర్కిటెక్చర్ రిజిస్ట్రార్ రాజేశ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం

కడప (ఎడ్యుకేషన్), జూలై 31 : యూనివర్సిటీల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడడానికి ప్రథమ ప్రాధాన్యమిస్తామని వైస్ చాన్సలర్ ప్రొఫెసరు కృష్ణారెడ్డి తెలిపారు. విద్యార్థుల సమస్యలపై చర్చించేందుకు వసతిగృహాల చీఫ్ వార్డెన్ రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డితో బుధవారం ఆయన సమావేశమయ్యారు. సాయంత్రం యూనివర్సిటీ నుంచి గురుకులంలోకి బస్సులను నడపాలని జూనియర్ హాస్టల్స్‌కు వెళ్లే సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా విద్యార్థులు కోరారు. క్రీడలపై చర్చించారు. అందుకు వీసీ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారు.

హాస్టల్‌లో సౌకర్యాలపై జడ్జి ఆగ్రహం

రాయచోటిటౌన్, జూలై 31: పట్టణంలోని గిరిజన బాలికల కళాశాల హాస్టల్‌లో సౌకర్యాలపై జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హాస్టల్‌ను తనిఖీ చేసిన ఆయన వంట గదిని, అక్కడున్న కూరగాయలు, సరుకులు పరిశీలించారు. కూరలు రుచి చూశారు. తాగునీటి సరఫరా సరిగ్గా లేదని విద్యార్థులు జడ్జికి ఫిర్యాదు చేశారు. హాస్టల్ పరిశుభ్రంగా లేదని వార్డెన్‌ను హెచ్చరించారు. హాస్టల్‌లో నెలకొని ఉన్న సమస్యలను అధికారులతో చర్చించి మంచినీటి వసతిని కల్పిస్తానని తెలియజేశారు. ప్రభుత్వ నిబంధన మేరకు పిల్లలకు మంచి భోజనం అందించాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. మళ్లీ నేను హాస్టల్ విజిట్‌కు వచ్చేటప్పటికీ హాస్టల్‌లో మార్పులు ఉండాలని, మంచి వసతులతో ఉండాలని వార్డెన్‌కు సూచించారు.

విద్యార్థులున్నారంటే రైట్.. రైట్..

- బస్సు ఆపకుండా వెళ్లిన ఆర్టీసీ డ్రైవరు
- వాగ్వాదంతో ఆగిన ట్రాఫిక్

ఖాజీపేట, జూలై 31: బస్సులు ఆపకపోవడంతో, గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నా మని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. ఖాజీపేట మండల పరిధిలోని మోడల్ స్కూల్‌లో దాదాపు 300 మంది బస్సు ప్రయాణం చేసే విద్యార్థులు ఉన్నారు. టార్గెట్ అందదన్న ఉద్దేశంతో ఆర్టీసీ సిబ్బంది విద్యార్థులు వేచి చూసే బస్టాపుల్లో బస్సులు నిలపకుండా వెళ్లిపోతున్నారు. దీంతో చాలా సార్లు ఫస్ట్ పీరియడ్ కూడా అయిపోతోందని, సాయంత్రం వేళల్లో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని, తమను బస్‌స్టాపులో చూడగానే బస్సును మరింత వేగంగా నడుపుతూ వెళ్లిపోతున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ బస్సును ఎక్కినా తమను చులకనగా చూస్తున్నారని అంటున్నారు. కాగా, బుధవారం ఆగకుండా వెళుతున్న బస్సుకు స్కూలు అటెండర్ అటెండర్ అడ్డుగా వెళ్లి ఆపాడు. దీంతో డ్రైవర్ అటెండర్‌తోపాటు విద్యార్థులతో వాగ్వాదానికి దిగాడు. ఫలితంగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువురికి నచ్చజెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని విద్యార్థుల కోసం బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



వాగ్వాదం చేస్తున్న డ్రైవర్

లోకేశ్ దృష్టికి రాజంపేట సమస్యలు

రాజంపేట, జూలై 31: రాజంపేట నియోజకవర్గ సమస్యలను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు రాజంపేట టీడీపీ నేతలు వివరించారు. బుధవారం విజయవాడకు వెళ్లి ఆయనను కలిసి అన్ని విషయాలు చర్చించారు. అదేవిధంగా రాజంపేట నియోజకవర్గ టీడీపీ నేతల మధ్య అనైక్యత, నియోజకవర్గ ఇన్‌చార్జి అంశంపై స్పష్టత లేని అంశాన్ని వివరించారు. లోకేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ గెలవక పోవడానికి గల కారణాలు, పార్టీ ఓటమికి బాధ్యులైన నాయకులపై వివరాలు సేకరించి స్పష్టమైన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, మేకా నరసింహులు, కమ్మ సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణచౌదరి, గంప శివ, కొమ్మి సాంబశివయ్యనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి కొల్లి రెడ్డయ్యనాయుడు, నాగినేని దివాకర్, గుగ్గిళ్ల చంద్రమౌళి, వేణు, చెంగల్‌రాయుడు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొలంబడితో నాణ్యమైన దిగుబడులు


పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న జేడీఏ

లక్కిరెడ్డిపల్లె, జూలై 31: పొలంబడితో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గంగనపల్లెలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమం వలన రైతులకు పంటలు మార్పు, మట్టినమూనాలు, పొలంబడి అవశ్యకతను గురించి వివరించారు. పంట సాగుచేసిన ప్రతి రైతు ఈ క్రాస్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకురాలు జయరాణి, ఏఓ రమేష్‌బాబురావు, ఏఈఓలు అనూష, రమేష్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేస్తే అపరాధ రుసుం తప్పదు

పెనగలూరు, జూలై 31: మండల కేంద్రమైన పెనగలూరులో ఆర్ అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, టిఫిన్, చికెన్ సెంటర్లు ఇతర షాపుల వారు ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే ప్రభుత్వపరంగా చెత్తవేసిన వారికి అపరాధ రుసుం విధించాల్సి ఉంటుందని పెనగలూరు పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు హెచ్చరించారు. ఈ సందర్భంగా బుధవారం రోడ్డుకిరువైపులా చెత్త శుభ్రం చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లతో కలిసి ఆయన ఉన్నత పాఠశాల సమీపం నుంచి బస్టాండ్ మూడు రోడ్ల కూడలి వరకు, అక్కడి నుంచి కొత్తపల్లె బస్టాండ్ వరకు ప్రజలను మైకు ద్వారా అప్రమత్తం చేశారు. ప్రతి షాపు ముందు చెత్త వేసేందుకు ఒక డబ్బాను ఉంచుకుని అందులో చెత్త వేస్తే శుభ్రం చేయడానికి వీలుంటుందన్నారు. ఒకవేళ ప్రభుత్వ హెచ్చరికలు ఎవరైనా ఖాతరు చేయకపోతే చట్టపరంగా పోలీసు కేసులు నమోదు చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

బకాయిలను విడుదల చేయించండి

రాయచోటిటౌన్, జూలై 31: గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, పీడీఎస్‌యూ జిల్లా బాధ్యుడు ఎం. అంకన్న, ప్రసాద్‌లు కోరారు. బుధవారం వారు రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 9 నెలలు నుంచి మెస్ బిల్లులు అందకపోవడంతో వసతి గృహ అధికారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ పట్టణ నాయకులు సాంబ, నరేశ్, ఖాజావలి పాల్గొన్నారు.

కౌలురైతు మృతిపై విచారణ


కౌలు రైతుపై విచారణ చేపడుతున్న దృశ్యం

సిద్దవటం, జూలై 31: శేఖరాజుపల్లె గ్రామ పంచాయతీ బ్రాహ్మణపల్లెకు చెందిన కౌలు రైతు వేటూరి పిచ్చయ్య (57) మృతిపై బుధవారం మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శివకుమార్ తన సిబ్బందితో మృతుని కుటుంబానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతిచెందిన పిచ్చయ్య జూలై 27వ తేదీన పొలం పనుల నిమిత్తం వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారని వైద్య సిబ్బంది తెలియజేశారు. పొలంలో కలుపు మొక్కలు తీస్తుండగా విషపురుగు కాటుకు గురై చికిత్స నిమిత్తం ఒంటిమిట్ట ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వెళ్లారని, మెరుగైన వైద్యసేవల నిమిత్తం అదేరోజు కడప రిమ్స్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలియజేసినట్లు వైద్యులు తెలియజేశారు. 3 రోజులు వైద్య చికిత్సలు తీసుకుంటూ జూలై 30న ఉదయం కడప రిమ్స్‌లో చనిపోయినట్లు తమ విచారణలో తేలిందని డాక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుకు యువత దూరంగా ఉండాలి

లక్కిరెడ్డిపల్లె, జూలై 31: యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదని, దూరంగా ఉండాలని టీడీపీ మండల తెలుగుయువత అధ్యక్షుడు పక్కీరయ్య పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లెలో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా మంది యువత చిన్న ఆనందం కోసం గంజాయి,మారకద్రవ్యాలు సేవించడంతో జీవితం నాశనం అవుతుందన్న విషయాన్ని గమనించాలన్నారు. ఈ క్యాక్రమంలో జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర బీసీ కార్యనిర్వాహన కార్యదర్శి శంకారపు జయారం, ఆరీఫుల్లా, ఓబుల్‌రెడ్డి, నాగరాజు, వెంకటరమణ, న్యాయవాది సిద్దయ్య, రమేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

8న స్కూల్ కమిటీ ఎన్నికలు

సంబేపల్లె, జూలై 31: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆగస్టు 8న సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఆగస్టు 1వ తేదీ పాఠశాల నోటీసు బోర్డులో ఎన్నికల నోటిఫికేషన్ ఉంచబడుతుందని అదే రోజు సాయంత్రం ఓటర్ల జాబితా ప్రకటించబడుతుందన్నారు. ఆగస్టు 8వ తేదీ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు జరుగుతాయని, అదేరోజు చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక ప్రమాణస్వీకారం జరుగుతుందన్నారు.

అంగన్వాడీ అ(వ్య)వస్థ

- సౌకర్యాలు కరువు.. బాల్యం బరువు
- అసంపూర్తిగా అంగన్వాడీ భవనాలు
- ఇరుకు గదులు.. అద్దె రూములే దిక్కు
- చిన్నారులకు తప్పని తిప్పలు


అర్థంతరంగా మారిన దేవాండ్లపల్లె అంగన్వాడీ భవనం

సుండుపల్లె, జూలై 31: గత వైసీపీ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామని గొప్పలు పలికింది. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారుస్తామని చెప్పింది. క్షేత్రస్థాయిలో మాత్రం అంగన్వాడీ వ్యవస్థ.. అవస్థగా మారింది. ముఖ్యంగా కేంద్రాలు అధ్వానంగా మారి సమస్యలతో సతమతమవుతున్నాయి. కొన్ని చోట్ల కేంద్రాల్లో తగిన సౌకర్యాలు, మరుగుదొడ్లు, తాగునీటి వంటి కనీస వసతులు లేకపోవడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో సమస్యగా మారింది. కొన్ని కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లో వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి సకాలంలో అద్దెకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో కార్యకర్తలు సొంతంగా చెల్లించాల్సి వస్తుంది. కొన్నింటికి ఎలాంటి భవనం లేకపోవడంతో కమ్యూనిటీ హాళ్లు ఉపయోగించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా నాడు-నేడు పథకానికి అంగన్వాడీ పాఠశాలలను ఎంపిక చేసింది. సంబంధించిన వివరాలు పంపాలని అధికారులను కోరింది. దీంతో ప్రభుత్వ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందని అందరూ భావించారు. చివరకు అంగన్వాడీ నూతన భవనాల నిర్మాణానికి నిధులు విడుదల చేయలేదు.


అంగన్వాడీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో రేకుల షెడ్డు కింద అంగన్వాడీ కేంద్రం నిర్వహణ

26 భవనాల నిర్మాణాలకే నిధులు రాక

మండల వ్యాప్తంగా 26 అంగన్వాడీ భవనాల నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. నాడు- నేడు పథకం ద్వారా అన్ని ప్రభుత్వ బడులకు వసతులు కల్పిస్తామని చెప్పిన ఆర్భాటపు ప్రకటనలు కేవలం నోటి మాటలకే పరిమితమయ్యాయని విమర్శలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా 115 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 89 మెయిన్ అంగన్వాడీ కేంద్రాలు, 36 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి.చాలా అంగన్వాడీలు అద్దె భవనాల్లో లేదా సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. కేవలం 26 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చినా... నిర్మాణాలను సైతం పూర్తి చేయలేకపోయారని విమర్శలున్నాయి. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడంతో పాటు గోరుముద్దలు తినిపించేందుకు, తల్లి బిడ్డ క్షేమంగా ఉండేలా గర్భిణీ, బాలింత తల్లులకు పౌష్టికాహారం అందించాలన్నదే లక్ష్యం. గత ఐదేళ్లుగా ఆ లక్ష్యానికి నిరుపేదలు దూరమయ్యారు. వసతులు కల్పించి అంగన్వాడీల బలోపేతానికి కృషి చేయాలని అధికారులను ప్రజలు కోరుకుంటున్నారు.

ఐదేళ్లుగా గునాదులు.. గోడలే

ప్రభుత్వం అంగన్వాడీ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సకాలంలో నిధులు వస్తాయి. నిర్మాణాలు పూర్తి చేస్తామని ఆశించిన కాంట్రాక్టర్లు, అంగన్వాడీ కార్యకర్తలకు వైసీపీ పాలనలో నిరాశ ఎదురైంది. మండల వ్యాప్తంగా దాదాపు 20కి పైగా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందేవి. ఇస్తామన్న నిధులు రాకపోవడం.. ఆలస్యం కావడం వలన ఎక్కడ నిర్మాణాలు అక్కడే ఆగిపోయాయి. నిధులు రాక ఆలస్యం కావడం వలన నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోయాయి. నిధులు సరిపోవడం లేదని కొందరు కాంట్రాక్టర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల అంగన్వాడీ కేంద్రాల ఊసే కనిపించడం లేదు. కొంతమంది ఇళ్లలోనే సెంటర్లు నిర్వహిస్తూ పాలు, కోడిగుడ్లు ఇతర ప్రభుత్వ సరఫరా చేసిన పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు.

నిధులు రాగానే పనులు పూర్తి చేస్తాం

- శశికళ, ఇన్‌చార్జి ఐసీడీఎస్ పీడీ



గత ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో నిధులు రాకపోవడం వలన పనులు పూర్తి కాలేదు. నిధులు ఉన్నంతవరకు పనులు పూర్తయ్యాయి. అంగన్వాడీ కేంద్రాల సమస్య చాలా చోట ఉంది. నాడు-నేడు ద్వారా నిర్మాణాలు ప్రారంభమైనా వాటిని ప్రభుత్వం నుంచి నిధులు రాగానే పూర్తి చేసి సేవలందిస్తాం.

మార్పు వైపు అడుగులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీలు పూర్తి స్థాయిలో బలోపేతమయ్యేలా ఉన్నాయని తెలుస్తోంది. గతవారం రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసి అంగన్వాడీల తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సీడీపీవోలను ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి పంపించి అంగన్వాడీల సేవలు ఎలా ఉన్నాయి ? చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందుతుందా లేదా ? అసలు అంగన్వాడీ కేంద్రాలు ఉపయోగంలో ఉన్నాయా ? అనే విషయాలను ఆరా తీస్తున్నారు. అందుకు నిదర్శనమే.. మండలంలో శుక్రవారం రైల్వేకోడూరు నుంచి ఒక ప్రత్యేక అధికారిణి (సీడీపీవో) వచ్చి పలు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.


గోడలకే పరిమితమైన జనార్థన్‌రెడ్డి నగర్ అంగన్వాడీ భవనం

మాట నిలబెట్టుకుంటా : ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

పెనగలూరు, జూలై 31: కొత్త సింగనమల ప్రజలు గత సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించిన సహాయాన్ని మరచిపోనని, ఈ గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని రైల్వేకోడూరు జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. బుధవారం కొత్త సింగనమల గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ఆయన గ్రామదేవత గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను, రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ఎన్నికల ముందు ఈ గ్రామాన్ని సందర్శించినప్పుడు గ్రామ ప్రజలంతా ఏకమై తమకు ఓట్లు వేస్తామని ఈ గ్రామంలో యల్లమ్మ, గంగాలమ్మ దేవాలయాలు నిర్మించాలని కోరగా అందుకు తాము హామీ ఇచ్చామని గుర్తు చేశారు. అదేవిధంగా మాట తప్పకుండా రూపానందరెడ్డి సేవా ట్రస్టు ద్వారా గాని, టీడీపీ ట్రస్టు ద్వారా గాని నిర్మించేందుకు తాము కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ముక్కా సాయివికాస్‌రెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఎం.రాంప్రసాద్‌నాయుడు, కమ్మ సంఘం మండల ప్రధాన కార్యదర్శి వి.నరేష్ నాయుడు అలియాస్ బాబునాయుడు, సింగనమల సర్పంచి ఎర్రి శివయ్య పాల్గొన్నారు.

రాజంపేట డీఎస్పీగా ప్రకాశ్‌బాబు

రాజంపేట, జూలై 31: రాజంపేట డీఎస్పీగా ప్రకాష్‌బాబును నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడలో దిశ పోలీసుస్టేషన్ డీఎస్పీగా ఈయన పనిచేస్తున్నారు. రాజంపేట డీఎస్పీ వీఎన్‌కె చైతన్య తాడిపత్రిలో వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడం, వైసీపీకి అనుకూలంగా ఉండడంతో ఆయనకు ఎటువంటి పోస్టింగ్ ఇవ్వకుండా రిజర్వులో ఉంచారు. ఈయన తాడిపత్రిలో పనిచేసేటప్పుడు వైసీపీ ఎమ్మెల్యేకు అనుకూలంగా ఉండి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టడం, ఎన్నికల సమయంలో జేసీ దివాకర్‌రెడ్డి ఇంటిపై విచక్షణారహితంగా దాడులు చేసినట్లు విమర్శలు ఉన్నాయి. జేసీ ప్రభాకర్ కుటుంబీకులపై అనేక అక్రమ కేసులు పెట్టారు. టీడీపీ నేతలే టార్గెట్‌గా పనిచేసి వైసీపీ ఏజెంటుగా మారి తాడిపత్రిలో టీడీపీ నేతలపై దాడులు చేసినట్లు ఆరోపణలున్నాయి.

ప్రజాదర్బారులో మంత్రి బిజీబిజీ


వినతులను స్వీకరిస్తున్న మంత్రి

రాయచోటిటౌన్,జూలై 31: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల మంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజా దర్బార్‌లో బిజీబిజీగా గడిపారు. విజయవాడ నుండి బుధవారం మధ్యాహ్నం రాయచోటి చేరుకున్న మంత్రి మండిపల్లి తన కార్యాలయంలో రాయచోటి నియోజకవర్గంతో పాటు అన్నమయ్య జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి పలు రకాల సమస్యలతో వచ్చిన ప్రజలను అప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను వింటూ వినతి పత్రాలను స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొన్ని సమస్యలను అప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే విచారించి పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఆగస్టు 1వ తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో గల సచివాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొననున్నారు.

భావితరాలకు స్ఫూర్తి ప్రదాత : జనసేన


విద్యార్థులకు భోజన పథకాన్ని అందజేస్తున్న బీజేపీ నేతలు

రాజంపేట, జూలై 31: ఆకలిగా ఉన్నవారికి ఉన్నంతలో పట్టెడు అన్నం పెడుతూ ఆకలి తీర్చే డొక్కా సీతమ్మ భావితరాలకు స్ఫూర్తి ప్రదాత అని జనసేన నేతలు కొనియాడారు. బుధవారం పట్టణంలోని ఆరో వార్డులోని ప్రాథమిక పాఠశాలలో డొక్కా సీతమ్మ భోజన పథకాన్ని అమలు చేశారు. ఈ సందర్భంగా జనసేన నేత యల్లటూరు శివరామరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి జగనన్న గోరుముద్దగా ఉన్న పథకాన్ని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు పేరు మార్చడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు భోజనాన్ని వడ్డి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సమ్మెట శివప్రసాద్, కుళాయప్ప, పీవీఆర్ కుమార్, బీజేపీ నేత సమ్మెట నరేంద్ర, సతీష్‌నాయుడు, రామచంద్ర పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌కు బీజేపీ నేతల వినతి



రాజంపేట, జూలై 31: రాజంపేట డివిజన్ పరిధిలో పలు సమస్యలు వెంటనే పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, బీజేపీ నేతలు వినతిపత్రం అందజేశారు. బుధవారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. రాజంపేట డివిజన్‌లో ఇసుక క్వారీ లేక రెండు నెలలుగా భవన కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వీటిపై ఆమె స్పందిస్తూ వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖలతో సమన్వయం చేసి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆదినారాయణ, జీకే నాగరాజు, వీవీ రమణ, టి.హరిప్రసాద్, నవీన్‌కుమార్, తోట నగేష్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

- ఐదుగురికి కత్తి గాయాలు

రైల్వేకోడూరు(రూరల్), జూలై 31: మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారి ఓం శాంతి కార్యాలయం వద్ద పట్టణానికి చెందిన యువకులు మద్యం మత్తులో ఘర్షణ పడ్డారు. రామరాజు, విగ్నుఇద్దరు అటుగా వెళ్తున్న త్రిమూర్తి నగర్‌కు చెందిన చల్లా మోహిత్‌పై దుర్భాషలాడి దాడి చేస్తుండగా సమాచారం తెలుసుకున్న మోహిత్ తల్లిదండ్రులు, మిత్రులు అక్కడికి చేరుకోగా ఇరు వర్గాలకు వాదోపవాదాలు పెరిగి కత్తులతో దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో ఇరువర్గాలకు చెందిన ఐదుగురికి గాయాలైనట్లు సీఐ టి.బాబు తెలిపారు. క్షతగాత్రులు రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

నక్కలపల్లిలో పారిశుధ్య కార్యక్రమం

చిట్వేలి, జూలై 31: విజువలీ క్లీన్ విలేజి కార్యక్రమంలో భాగంగా బుధవారం నక్కలపల్లి పంచాయతీలోని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు సర్పంచ్ రామసుబ్బమ్మ ఆధ్వర్యంలో కార్యదర్శి జయలలిత పారిశుధ్య పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్‌నాయుడు, గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ మరమ్మతులపై నేడు సమీక్ష

ఒంటిమిట్ట, జూలై 31: ఆంధ్రా అయోధ్యగా పేరుగాంచిన కోదండరామాలయం గుడి అంతరాయంలో మరమ్మతులు చేపట్టేందుకు ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు, టీటీడీ అధికారులు గురువారం సమీక్షించనున్నారు. ఆగస్టు 12 నుంచి మరమ్మతుల కోసం సుమారు నెల రోజుల పాటు స్వామివారి దర్శనానికి ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. అందుకు ప్రత్యామ్నాయంగా స్వామివారిని బలయానం చేపట్టి ఆలయ ప్రాంగణంలో ఓ చోట ఉంచి భక్తులకు ఉత్సవ విగ్రహాల ద్వారా స్వామివారి దర్శనం కల్పించనున్నారు. ఆలయ గోపురంపై ఉన్న విమాన మండపం, రంగ మండపంలోని నల్లరాతి బండలను తొలగించి చలువరాతి బండలను ఏర్పాటు చేయాలని, వీటితో పాటు అంతరాలయంలో కూడా బండలు మార్చాలని పురావస్తు శాఖ టెండర్లను పిలిచి పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్ర గుర్తింపు పొందిన ఆలయం కావడంతో ఆలయానికి వచ్చే భక్తుల దర్శనార్థం ఏవిధంగా చేపట్టాలని దానిపై టీటీడీ ఆర్కిలాజికల్ అధికారులు ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతున్నారు.

రేషన్ బియ్యం తూకం అవకతవకలపై ఆర్డీవో విచారణ

ఒంటిమిట్ట, జూలై 31: మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోడౌన్‌లో రేషన్ బియ్యం తూకంలో తేడాపై ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటపతి విచారణ చేపట్టారు. సిద్దవటం, నందలూరు, ఒంటిమిట్ట మండలాలకు రేషన్ బియ్యం సప్లై గోడౌన్‌లో రేషన్ డీలర్లకు తూకంలో తేడా వస్తున్నాయని డీలర్ ప్రశ్నించడంతో గోడౌన్ ఇన్‌చార్జి గీతాప్రసాద్ డీలర్‌పై అసభ్య పదజాలంతో మాట్లాడడం సోషల్ మీడియాలో ప్రచారమైన విషయం విధితమే. దీనిపై వెంటనే ఆర్డీవో విచారణ చేపట్టారు. ప్రజలకు అందాల్సిన బియ్యంలో తేడా వస్తున్నాయని మాధవరానికి చెందిన డీలర్ ప్రశ్నించారు. బియ్యం తూకాల్లో తేడా వస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా బియ్యాన్ని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటరమణ, గోడౌన్ ఇన్‌చార్జి గీతాప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి : కత్తి

సుండుపల్లె, జూలై 31: విద్యారంగ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ఉపాధ్యాయులకు పదవీ విరమణ తప్పనిసరిగా వస్తుందని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని వెంగమరాజుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పూజారి రామచంద్రయ్య, జీకేరాచపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న షేక్.నూరుల్లా పదవీ విరమణ కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరై సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధానోపాధ్యాయులు సుమలత, జయన్న, పీఆర్‌టీయూ, ఆర్జేయూపీ, యూటీఎఫ్, ఎస్టీయూ సంఘాల నేతలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాజంపేటటౌన్, జూలై 31: పారిశుధ్య కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత సి.రవికుమార్ మాట్లాడుతూ రాజంపేట మున్సిపల్ పరిధిలో గత రెండున్నర సంవత్సరాలుగా పారిశుధ్య కార్మికులుగా 14 మంది పనిచేస్తున్నారని, అయితే మున్సిపల్ కమిషనర్ రాంబాబు హఠాత్తుగా వారిని రావద్దని ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

వ్యక్తికి 30 రోజుల జైలు శిక్ష

నందలూరు, జూలై 31: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ భగవత్‌సింగ్ కాలనీకి చెందిన బొజ్జగాని సుబ్రమణ్యంకు 30 రోజులు రిమాండ్ విధించారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడడంతో అతనికి నందలూరు న్యాయమూర్తి నందిని పై విధంగా తీర్పునిచ్చారు. ముద్దాయిని రాజంపేట సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్ఐ అబ్దుల్‌జహీర్ తెలిపారు.

పాఠశాలపై చర్యలు తీసుకోండి: ఆర్ఎస్‌యూ

రాయచోటిటౌన్, జూలై 31: రైల్వేకోడూరులో ఎటువంటి గుర్తింపు లేకుండా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటి పట్టణంలోని డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం డీఈవో శివప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వంశీరెడ్డి, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, కల్యాణ్, నూర్ మహమ్మద్, సందీప్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

గాలివీడు, జూలై 31: ఉచిత వైద్య సేవలు అభినందనీయమని స్థానిక వెంకటేశ్వర హాస్పిటల్ వైద్యుడు పుల్లారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక వెంకటేశ్వర హాస్పిటల్‌లో మదనపల్లె వెంకటేశ్వర హార్ట్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ ఎన్‌బీ కిశోర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని అయన ప్రారంభించారు. దాదాపు 250 మందికిపైగా రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్, ప్రసాద్, వెంకటేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన మేరకు పదవుల పందేరానికి ముహూర్తం సమీపిస్తోంది. కూటమి పార్టీల అధిష్ఠానాలు ఎంపిక ప్రక్రియపై కసరత్తు ప్రారంభించాయి. ఇప్పటికే జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కష్టపడి పనిచేసిన నాయకులు, క్రియాశీలక కార్యకర్తల వివరాలను సేకరిస్తున్నాయి. ఆగస్టు మొదటి వారం తర్వాత విడతల వారీగా నామినేటెడ్ పదవులు భర్తీ చేసేందుకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఆగస్టు నెలాఖరులోపు సాధ్యమైనంత వరకూ మొత్తం పదవులు భర్తీ చేసే అవకాశం వుంది. దీంతో తిరుపతి జిల్లాలో ఆశావహుల ప్రయత్నాలు జోరందుకున్నాయి. రెండేళ్ళ తర్వాత పరిస్థితులు ఎలా వుంటాయోనని తొలి విడతలోనే ఛాన్సు కొట్టేయాలని ఆశావహులు ఆరాటపడుతున్నారు. దీంతో చివరి ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వీరీ.. వీరీ.. గుమ్మడి పండూ..
వీరికే పదవి?

ఈ నెలలోనే నామినేటెడ్ పదవుల పందేరం

జోరందుకున్న ఆశావహుల యత్నాలు

కష్టపడిన వారిని గుర్తిస్తున్న అధిష్ఠానాలు

కూటమి పార్టీల అధిష్ఠానాలు నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ నేపథ్యంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యాయి. టీడీపీ విషయానికొస్తే నియోజకవర్గం నుంచీ వందమంది పేర్లను అప్‌లోడ్ చేయాలని అధిష్ఠానం ఆదేశించింది. ఆ మేరకు ఇప్పటికే జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచీ 80 వరకూ పేర్లు అధిష్ఠానానికి అందాయి. జిల్లా పార్టీ అధ్యక్షుడు జిల్లావ్యాప్తంగా 100-150 పేర్లు పంపించాల్సి వుంది. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి కష్టపడిన వారి జాబితా అప్‌లోడ్ చేసే బాధ్యత కూడా జిల్లా అధ్యక్షుడికే అప్పగించినట్టు సమాచారం. ఇప్పటి వరకూ తిరుపతి నుంచీ 90 పేర్లు అప్‌లోడ్ అయ్యాయని చెబుతున్నారు. జనసేన పార్టీలో కూడా ఇదేరకమైన వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. ఈ పేర్లు ముందుపెట్టుకుని వారి స్థాయిని బట్టి స్థానికంగా ఆలయ కమిటీల్లో సభ్యులుగా, ఛైర్‌పర్సన్లుగా, మార్కెట్ కమిటీలలో డైరెక్టర్లుగా, ఛైర్‌పర్సన్లుగా, రాష్ట్రస్థాయి కార్పొరేషన్లలో డైరెక్టర్, ఛైర్‌పర్సన్ పోస్టులకు ఎంపిక చేయనున్నారు.

అందరి గురీ టీటీడీ, తుడాలపైనే!

టీటీడీ బోర్డు ఛైర్మన్, మెంబరు పదవులపైన, తుడా ఛైర్‌పర్సన్ పదవిపైనా ఎక్కువమంది ఆశావహులు గురి పెడుతున్నారు. టీటీడీ ఛైర్మన్ పదవి రాష్ట్రస్థాయిలో కీలకం కావడంతో జిల్లానుంచీ ఒకరిద్దరు మాత్రమే ఆశిస్తున్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ తాను గతంలో తుడా ఛైర్మన్‌గా పనిచేసినందున ఈ పర్యాయం టీటీడీ ఛైర్మన్ పదవి ఇవ్వాలని, తిరుపతి ప్రాంత యాదవులతో శ్రీవారి ఆలయానికి వున్న అవినాభావ సంబంధాన్ని దృష్టిలో వుంచుకుని తనకు అవకాశం కల్పించాలని గట్టిగా కోరుతున్నారు. తన వయసు దృష్ట్యా రాజకీయంగా ఇదే తనకు చివరి అవకాశమని గుర్తు చేస్తున్నారు. టీటీడీ ప్రయోజనాల కోసం పోరాడిన నేపథ్యం కలిగిన తనను ఛైర్మన్‌గా నియమించాలని బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి అభ్యర్థిస్తున్నారు. వీరిద్దరే బాహాటంగా టీటీడీ ఛైర్మన్ పదవి కోరుతున్నారు.

టీటీడీ మెంబరు కోసం 300 దరఖాస్తులు

టీటీడీ బోర్డు మెంబరు పదవి కోసం రాష్ట్రవ్యాప్తంగా సీఎం చంద్రబాబుకు ఇప్పటి వరకూ 300 దరఖాస్తులు అందినట్టు సమాచారం. మూడు పార్టీలతో కూడిన కూటమి ప్రభుత్వం కావడం వల్ల చంద్రబాబుపై టీటీడీలో మెంబరు పదవుల కోసం మూడు పార్టీల నుంచీ విపరీతమైన ఒత్తిడి వుంది. 24 మందిని మాత్రమే నియమించే వీలున్నందున ఆశావహులను వడపోయడం సంక్లిష్టంగా మారిందని సమాచారం. జిల్లాకు లేదా తిరుపతికి కనిష్ఠంగా ఒకటి లేదా గరిష్ఠంగా రెండు మెంబరు పదవులకు మించి కేటాయించే అవకాశం లేదు. ఒత్తిడి ఎక్కువైతే ఒక్కటి కూడా ఇవ్వకపోయినా ఆశ్చర్యపడాల్సిన పని లేదు. జిల్లా నుంచీ బోర్డు మెంబరు కావాలని చాలామంది ఆశిస్తున్నారు. టీడీపీ నుంచీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కోడూరు బాలసుబ్రమణ్యం, శ్రీధర్ వర్మ, హేమాంబరధర రావు, ఊకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాస్ తదితరులు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. అలాగే జనసేన నుంచీ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ ఈ పదవి కోసం రేసులో వున్నారు. బీజేపీ నుంచీ ఛైర్మన్ పదవి రాకపోతే మెంబరు పదవి ఇవ్వాలని భానుప్రకాష్‌రెడ్డి కోరుతుండగా సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్ పేర్లు కూడా పరిశీలనలో వున్నాయి. వీరిలో పలువురు గత ప్రభుత్వంలో పోలీసు కేసులు, వేధింపులకు గురయ్యారు. అలాగే కొందరు తమ పార్టీల కోసం కష్టకాలంలో ఆర్థిక భారం కూడా వహించారు.

తుడా ఛైర్మన్ పదవికి పలువురు ఆశావహులు

టీటీడీలో ఎక్స్ అఫిషియో మెంబరు హోదా కలిగిన తుడా ఛైర్మన్ పదవిని సైతం పలువురు నేతలు ఆశిస్తున్నారు. బ్రహ్మాండమైన కార్యాలయం, సిబ్బంది, వనరులు, క్యాబినెట్ హోదా కలిగిన పదవి కావడంతో ఈ పదవికి క్రేజ్ పెరిగింది. ఈ పదవికి తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రవినాయుడు, చంద్రగిరి నేతలు డాలర్స్ దివాకర్‌రెడ్డి, బడి సుధా యాదవ్, తిరుపతి నేతలు మబ్బు దేవనారాయణరెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. రవినాయుడు తనకు అవకాశం ఇస్తే సామాన్య కార్తకర్తను గుర్తించినట్టు అవుతుందని, యువతను ప్రోత్సహించినట్టు అవుతుందని చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ళూ కష్టపడి పనిచేశానని, యువగళం పాదయాత్రలోనూ, అలాగే అధినేత సతీమణి భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమంలోనూ వెన్నంటి నడిచానని చెబుతున్నారు. బడి సుధా యాదవ్ చంద్రగిరి ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శ్రమించగా దివాకర్‌రెడ్డి శ్రీకాళహస్తి, చంద్రగిరిల్లో పార్టీ కోసం పనిచేశారు. దేవనారాయణరెడ్డి తిరుపతి, చంద్రగిరి సెగ్మెంట్లలో పార్టీ కోసం పనిచేశారు. వీరిలో రవినాయుడు, సుధా యాదవ్, దేవనారాయణరెడ్డి పార్టీ కోసం పలు పోలీసు కేసులు, వేధింపులు ఎదుర్కొన్నారు. జనసేన నుంచీ హరిప్రసాద్, కిరణ్ రాయల్ టీటీడీ బోర్డు మెంబరు కాకుంటే తుడా ఛైర్మన్ పోస్టు అయినా దక్కుతుందని ఆశిస్తున్నారు. వారిలో కిరణ్ రాయల్ గత వైసీపీ ప్రభుత్వంలో పోలీసు కేసులు, వేధింపులకు గురయ్యారు.

జోరందుకున్న ఆశావహుల యత్నాలు

నామినేటెడ్ పోస్టుల భర్తీకి సమయం సమీపించడంతో ఆశావహుల యత్నాలు జోరందుకున్నాయి. పలువురు నేరుగా తమ పార్టీల అధినేతలను కలుస్తున్నారు. ఆయా పార్టీల కోసం తాము అందించిన సేవలను గుర్తు చేస్తూ, పార్టీల కోసం తాము పడిన కష్టాలను ఏకరువు పెడుతున్నారు. తమకు ఫలానా పదవి కావాలని కొందరు సూటిగా ప్రస్తావిస్తుండగా మరికొందరు ఫలానా పదవి ఇవ్వాలని అది లేకుంటే ప్రత్యామ్నాయంగా ఫలానా పదవి ఇవ్వాలని అధిష్ఠానాల ఎదుట ప్రతిపాదనలు పెడుతున్నారు. కొందరైతే ఏ పదవి ఇచ్చినా పర్వాలేదని అధిష్ఠానాలకే వదిలి పెడుతున్నారు.

ప్రత్యామ్నాయంగా పార్టీ పదవులు

ప్రభుత్వ నామినేటెడ్ పదవుల కోసం పోటీ పెరిగిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పదవులు తెరపైకి వస్తున్నా యి. టీడీపీలో జిల్లా పార్టీ అధ్యక్ష పదవి, తిరుపతి అసెంబ్లీ ఇంచార్జి పదవులతో ఇద్దరిని సమాధానపరిచే అవకాశం కనిపిస్తోంది. అధికారంలో వున్నందున పార్టీ పదవులు తీసుకునేందుకు కొందరు సిద్ధంగా వున్నారు. అయితే వట్టి పార్టీ పదవులే అయితే తమకు అధికారులు విలువ ఇవ్వరని, ఏదో ఒకటి ప్రోటోకాల్ పదవి కూడా అనుబంధంగా ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తున్నారు. ఇదే పరిస్థితి జనసేన పార్టీలోనూ కనిపిస్తోంది. ఆశావహుల్లో ఎవరో ఒకరిని జిల్లా అధ్యక్ష పదవితో సంతృప్తిపరిచే అవకాశముంది.

జిల్లాలో భర్తీకి అవకాశం వున్న పదవులు ఇవీ!

తిరుపతి జిల్లాలో టీటీడీ ట్రస్టు బోర్డు ఛైర్మన్, బోర్డు మెంబర్లు, తుడా ఛైర్ పర్సన్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు కీలకమైనవి.ఇందులో టీటీడీ ఛైర్మన్ నిస్సందేహంగా రాష్ట్రస్థాయి పదవి. తుడా ఛైర్‌పర్సన్, తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు క్యాబినెట్ ర్యాంకు కలిగినవే అయినా వాటిని జిల్లాస్థాయి పదవులుగానే పరిగణించే పరిస్థితి. తర్వాత కేటగిరీలో ముక్కంటి, చెంగాలమ్మ, సురుటుపల్లి, వెంకటగిరి పోలేరమ్మ, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తదితర ముఖ్య ఆలయాల పాలక మండళ్ళు, జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ పదవులున్నాయి. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండళ్ళు వున్నాయి. ముక్కంటి ఆలయం మొదలుకుని ఇవన్నీ స్థానిక ప్రాధాన్యత కలిగిన పదవులు. ఇవి కాకుండా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు, వాటిల్లో డైరెక్టర్ పదవులు కూడా కొన్ని జిల్లాకు దక్కే అవకాశముంది. వివిధ అకాడమీలు, వక్ఫ్ బోర్డు, హజ్ కమిటీ, మహిళ, ఎస్సీ, మైనారిటీ కమిషన్ల ఛైర్‌పర్సన్ పదవులు, వాటిలో డైరెక్టర్ పదవులు వంటికి కూడా కొన్ని జిల్లా నేతలకు దక్కవచ్చు.

డీటీసీ డీఎస్పీ బదిలీ

చిత్తూరు, జూలై 31: డీటీసీ డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌ను ఏలూరు నగర డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. కుప్పం డీఎస్పీగా ఉన్న శ్రీనాథ్ ఇంటెలిజెన్స్ డీఎస్పీగా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా ఉన్న పార్థసారథిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్‌ఎంసీ ఎన్నికలకు మోగిన నగారా

చిత్తూరు (సెంట్రల్), జూలై 31: ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలకు రాష్ట్ర విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం ఎన్నికల షెడ్యూల్‌ను అధికారికంగా జారీ చేయనుంది. రెండేళ్ల కాలపరిమితితో కమిటీ ఏర్పాటు చేస్తారు. ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు అభ్యర్థుల జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారు. 5న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలను తెలియజేయడం, ఫిర్యాదులుంటే పరిష్కరించడం చేస్తారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటలకు తుది ఓటరు జాబితా ఖరారు, నోటీసు బోర్డులో ప్రదర్శన ఉంటుంది. 8న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల నిర్వహణ, మధ్యాహ్నం 1.30 గంటలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక, మధ్యాహ్నం 2 గంటలకు ప్రమాణస్వీకారం, మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ తొలి సమావేశం నిర్వహించాల్సి ఉంది.

నేడు పింఛన్ల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), జులై 31: సామాజిక పెన్షన్ల పంపిణీ గురువారం ఉదయం 6 గంటలకు ప్రారంభం కానుంది. జిల్లాలోని 2,70,619 మంది లబ్ధిదారులకు అవసరమైన రూ.114.10 కోట్లు విడుదలయ్యాయి. బ్యాంకుల ద్వారా ఈ మొత్తం గ్రామ, వార్డు సచివాలయాలకు చేరాయి. సచివాలయ ఉద్యోగులు ఉదయం 6 గంటల నుంచి పెన్షన్ పంపిణీ చేయనున్నారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటికివెళ్లి నేరుగా అందించనున్నారు.టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన రెండవనెల పెన్షన్ల పంపిణీ జరగనుంది. పెంచిన మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేయనున్నారు.జిల్లాలోఅత్యధికంగా 1.44లక్షలమంది వృద్ధాప్య పెన్షనర్లు ఉండగా, 59,903 మంది మంది వితంతువులు, 35,732 మంది వికలాంగులు, 11,470 మంది అభయహస్తం, 6375 మంది డప్పు కళాకారులు, 5747 మంది ఒంటరి మహిళలు, తదితర వర్గాలకు చెందిన వారు ఉన్నారు.

బాల కార్మిక రహిత జిల్లానే లక్ష్యం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 31: బాల కార్మికుల రహిత జిల్లాగా చిత్తూరును తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీఆర్వో పుల్లయ్య అన్నారు. బుధవారం జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన డీఆర్వో మాట్లాడుతూ 14 సంవత్సరాలలోపు బాలబాలికలను పనిలో పెట్టుకుంటే క్రిమినల్ కేసుతో పాటు జరిమానా ఉంటాయని తెలిపారు. బాలకార్మికులు పనిచేస్తున్నట్టు తెలితే 1098కి కాల్‌చేసి తెలియజేయాలన్నారు. గురువారం నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈవో దేవరాజులు, జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ ఓంకార్, చైల్డ్ హెల్ప్‌లైన్ కో-ఆర్డినేటర్, నాగమణి, పిల్లల సంరక్షణ అధికారి శివ, సహాయ కార్మిక అధికారి మధుబాబు పాల్గొన్నారు.

పెద్దూరు సర్పంచి చెక్ పవర్ రద్దు

రామకుప్పం, జూలై 31: రామకుప్పం మండలం 89పెద్దూరు పంచాయతీ సర్పంచి మల్లిక చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీలో ఈమె అందుబాటులో లేకపోవడం వల్ల తాగునీరు, వీధిదీపాలు, పారిశుధ్య సమస్యలతో తాము ఇబ్బందులు పడుతున్నట్టు జూలై 18న పలువురు గ్రామస్థులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్పంచు మల్లికపై తగు చర్యలు తీసుకుని, నిధులు డ్రా చేసే అధికారాన్ని నిషేధించాలని కోరారు. దీనిపై విస్తరాణాధికారి నివేదిక మేరకు సర్పంచుకు నిధులు డ్రా చేసే అధికారం నుంచి తప్పించినట్టు డీపీవో తమ అదేశాల్లో పేర్కొన్నారు. కుప్పం ఉపఖజానా అధికారి, వి.కోట స్టేట్‌బ్యాంకుతోపాటు ఇతర బ్యాంకుల వారు 89పెద్దూరు పంచాయతీకి సంబంధించి నిధుల విషయంలో కలెక్టరు జారీ చేసే చెక్కులను మాత్రమే అనుమతించాలని ఆ ఆదేశాల్లో ఆమె పేర్కొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా



పుంగనూరు రూరల్, జూలై 31: తాగునీటి సమస్య పరిష్కరించాలని పుంగనూరు టిట్కో ఇళ్ల మహిళలు ఖాళీబిందెలతో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ 15 రోజులుగా తాగునీరు రావడం లేదని, తాము కూలీ పనులకు వెళ్లి సంపాదించిన డబ్బుతో తాగునీరు కొనుగోలు చేస్తున్నట్లు వాపోయారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి మున్సిపల్ అధికారులు, సిబ్బందిని పంపించి పైపుల మరమ్మతు పనులు చేపట్టి తాగునీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నారు. దీంతో కాలనీ వాసులు కమిషనర్‌ను అభినందించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

రైతులు ఆధునిక పద్ధతులు అలవర్చుకోవాలి : కలెక్టరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరు సుమిత్‌కుమార్

రామకుప్పం, జూలై 31: రైతులు పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకుని లాభాల బాటలో పయనించాలని కలెక్టరు సుమిత్‌కుమార్, కడా పీవో వికాస్‌మర్మత్ కోరారు. బుధవారం రామకుప్పంలో ఉద్యానరంగంలో విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, అధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో రైతులకు పంటల సాగులో ఆధునిక పద్ధతులు, ప్రభుత్వ ప్రోత్సాహాలను, బ్యాంకు రుణాలు పొందడం, మంచి మార్కెటింగ్ సౌకర్యం వంటి వాటిపై అవగాహన ఎంతో అవసరమన్నారు. ఈ ప్రాంతంలో రైతులు 18రకాల ఉద్యానపంటలు, 12రకాల వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారన్నారు ఆగస్టు 10న కుప్పం కడా కార్యాలయంలో పీడీ అందుబాటులో ఉంటారన్నారు. బ్యాంకు రుణాలు, ప్రస్తుతం చేస్తున్న వృత్తి వివరాలు, ఆదాయమార్గాలు, ఏ ప్రాజెక్టు ద్వారా అభివృద్ధి చెందాలనుకుంటున్నారో వంటి వివరాలను రైతులు స్వయంగా అందించాలని వారు కోరారు. కుప్పంలో పండించే పండ్లు, కూరగాయాల ప్రాసెసింగ్, ప్రాసెస్‌ల మార్కెటింగ్ వంటి అంశాలపై పరిశీలిస్తామని వారు తెలిపారు. చిన్నతరహా పరిశ్రమల ప్రోత్సాహక, అభివృద్ధి సంస్థ పీడీ శ్రీనివాసులు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు, బ్యాంకు రుణాలు పొందడం, పారిశ్రామిక, సాంకేతిక సలహాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందిచే రుణాలను గూర్చి రైతులకు వివరించారు. ఈ సమావేశంలో లీడ్‌బ్యాంకు మేనేజర్ హరీష్, ఉద్యానశాఖ జిల్లా అధికారి మధుసూదన్‌రెడ్డి, ఏసీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, హార్టికల్చర్ ఏడీ కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ కుప్పం ఇన్‌చార్జి మునిరత్నం, తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం, నియోజక, మండల అధ్యక్షులు చలపతి, కొళ్ళపల్లెబాబు, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, ఏఎంపీ మాజీ ఛైర్మెన్, వైస్‌చైర్మన్లు సత్యేంద్రశేఖర్, సీతాపతి, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ, జనసేన మండల అధ్యక్షుడు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించని టెండర్‌దారులపై చీటింగ్ కేసు పెట్టాలి

మున్సిపల్ మీట్‌లో కౌన్సిలర్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా

పుంగనూరు, జూలై31: వైసీపీకి చెందిన వ్యక్తులు మున్సిపాలిటీలో వివిధరంగాల్లో వేలం పాటల ద్వారా టెండర్లు పొంది సొమ్ము చెల్లించకుండా మోసం చేసిన వారిపై చీటింగ్ కేసులు పెట్టి రికవరీ చేయాలని కౌన్సిలర్ ఎం.రామకృష్ణమరాజు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ ఛైర్మన్ ఎస్.అలీంబాషా అధ్యక్షతన కౌన్సిల్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణమరాజు మాట్లాడుతూ వేలం పాటల ద్వారా పన్నులు వసూలు చేసి బకాయి ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులు బకాయిదారులకు సహకరించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పన్నులు వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే బకాయిదారులకు నోటీసులు అందజేశామని, ఇటీవల రూ.8లక్షలు వసూలైందని, దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలో ప్రభుత్వ భూములు, కాల్వల ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఛైర్మన్ అలీంబాషా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సహకారంతో పుంగనూరు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు కౌన్సిలర్లు తెలిపారు. కాగా వైసీపీకి చెందిన ఛైర్మన్‌తోసహా 13మంది ఇటీవల వైసీపీకి రాజీనామా చేసి చల్లా రామచంద్రారెడ్డిని కలిసి టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కౌన్సిల్ మీట్‌కు వైసీపీ సభ్యులంతా గైర్హాజరయ్యారు. సమావేశంలో కౌన్సిలర్లు అమ్ము, మనోహర్, నరసింహులు, మమత, నయింతాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో కలెక్టర్‌కు 83 ఫిర్యాదులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, కడా పీడీ తదితరులు

కుప్పం, జూలై 31: కుప్పంలో బుధవారం కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. స్థానిక మండల సచివాలయంలో ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఈ వేదికలో వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన సమస్యలపై మొత్తం 83 ఫిర్యాదులు ప్రజలనుంచి అందాయి. ఇందులో రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులు మాత్రమే ఏకంగా 62 ఉండడం గమనార్హం. ఇవిగాక హౌసింగ్ 6, పశు సంవర్ధక శాఖ 4, బీసీ కార్పొరేషన్ 3, ఐసీడీఎస్, ద్రావిడ విశ్వవిద్యాలయం రెండేసి, డీఎస్పీ, పోలీసు, స్కిల్ డెవలప్‌మెంట్, మండల పరిషత్తు, తపాలా శాఖలకు సంబంధించి ఒక్కో ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదుకూ సత్వర పరిష్కారం లభిస్తుందని చెప్పారు. వారం రోజుల్లోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్డీవో జి.శ్రీనివాసులుతోపాటు నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, తహశీల్దార్లు, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడిగా కొనసాగించండి

నాడు ఈవో ధర్మారెడ్డి ఏకపక్షంగా తొలగించారు

హైకోర్టులో ఏవీ రమణ దీక్షితులు పిటిషన్

కౌంటర్ దాఖలుకు దేవదాయ ముఖ్యకార్యదర్శి, టీటీడీ ఈవోకు హైకోర్టు ఆదేశాలు

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి తప్పిస్తూ అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఏవీ రమణదీక్షితులు దాఖలు చేసిన పిటిషన్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయస్థానం, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శికి, టీటీడీ ఈవోకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగువారాలకు వాయిదావేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల శ్రీవారి ఆలయం ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి తప్పిస్తూ ఈ ఏడాది మార్చి 2న అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను ఏవీ రమణదీక్షితులు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది శీతిరాజు శ్యాంసుందర్ వాదనలు వినిపించారు. "పిటిషనర్‌కు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగించారు. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా టీటీడీ ఈవో అప్పట్లో వ్యవహరించారు. ఈవో ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసి రమణ దీక్షితులు ప్రధాన అర్చకుడిగా కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలి" అని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, జూలై 31: ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అవగాహన కల్పించాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. బుధవారం పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద, అపార్టుమెంట్లలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. పెండింగ్ గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు మరింత తగ్గే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. నేర ఛేదనలో, ప్రాపర్టీ రికవరీలో ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఏఎస్పీ అరీఫుల్లా, సెబ్ ఏఎస్పీ సుబ్బారావు, ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఇంకా నిర్లక్ష్యమేనా?

- బి.కొత్తకోటలో బయటకు కనబడుతున్న రికార్డులు



కార్యాలయం నుంచి రోడ్డుపైకి కనిపిస్తున్న ఖరీకార్డులు (ఇన్‌సెట్) కిటికీలో రికార్డులు

బి.కొత్తకోట, జూలై31: తహసీల్దార్ కార్యాలయాల్లో భూ ఫైళ్ల భద్రతపై ప్రత్యేక అధికారులను నియమించి మరీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధ రకాల రెవెన్యూ ఫైళ్లు కాలిపోయిన నేపథ్యంలో ఉలిక్కిపడిన రాష్ట్రప్రభుత్వం విచారణ కోసం ఏకంగా రాష్ట్రస్థాయి రెవెన్యూ, పోలీస్ అధికారులను రంగంలోకి దింపిన విషయం తెలిసిందే. మదనపల్లె డివిజన్ పరిధి అన్ని మండలాల్లోనూ మరోసెట్ రికార్డులను తయారు చేయడం, మదనపల్లె లాంటి ఘటన మండలాల్లో పునరావృతం కాకుండా రికార్డుల భద్రతపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. సంబంధిత అధికారులు పరిశీలించి తగుచర్యలకు సూచనలు, సిఫారసులు కూడా చేశారు. అయినా బి.కొత్తకోట మండలంలో రికార్డుల భద్రత విషయంలో ఉదాశీనత కనిపిస్తోంది. తహసీల్దార్ కార్యాలయం పై అంతస్తులో రోడ్డువైపునకు బాగా కనిపించేలా రికార్డులను ఉంచారు. అద్దాలు అమర్చిన కిటికీలోంచి కిందికు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకవేళ ఎవరైనా రాళ్లు విసిరితే అద్దాలు పగులుతాయి. కాగడా లాగా తయారుచేసి నిప్పంటించి విసిరితే జరగరానిది జరిగిపోనూవచ్చు. అని ఇది గమనించిన రైతులు చర్చించుకోవడం కనిపించింది. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలి మరి.

విద్యుదాఘాతంతో ఏలూరు వాసి మృతి



మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న సీఐ శేఖర్ - ఐషర్ వాహనం

వాల్మీకిపురం, జూలై 31: విద్యుత్ షాక్‌కు గురై ఏలూరు వాసి పదిలం శీను (41) అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ఏలూరు జిల్లా పెదవేగి మండలం చక్రాయగూడెం వాసి పదిలం శీను వ్యాపారం నిమిత్తం ఏలూరు నుంచి చాక్లెట్ తయారీ సామగ్రిని ఏపీ39యుక్యూ2664 నెంబర్ గల ఐషర్ లారీలో తమిళనాడులోని దారాపూర్‌కు తీసుకెళ్లాడు. అక్కడ సామగ్రి దించి, తిరిగి అదే లారీలో బయలుదేరాడు. ఆ లారీ డ్రైవర్ రెడ్డెప్ప అత్తగారి ఊరు వాల్మీకిపురం చేరేసరికి బుధవారం తెల్లవారుజాము కావడంతో లారీని బైపాస్ రోడ్డు ఓ పక్కగా ఆపి అత్తగారి ఇంటికి వెళ్లాడు. లారీ ఇళ్లకు అడ్డంగా ఉందని స్థానికులు చెప్పారు. అయితే డ్రైవర్ రెడ్డెప్ప ఎంతకూ రాకపోవడంతో లారీలోనే ఉన్న పదిలం శ్రీను ఉదయం 6 గంటలకు లారీని అక్కడ నుంచి తీసి రోడ్డు పక్కన ఆపి లారీ నుంచి కిందికి దిగబోయాడు. అప్పటికే లారీ పైభాగాన్ని విద్యుత్ తీగలు తాకి ఉండడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ పులి శేఖర్, ఎస్ఐ నాగేశ్వర్‌రావు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన ప్రమాదంపై విచారణ చేపట్టారు. శీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా బైపాస్ రోడ్డులో విద్యుత్ మెయిన్ లైన్ తీగలు కిందికి వేలాడడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రతి నిరుపేద కుటుంబానికీ పథకాలు



వాల్మీకిపురంలో నాయకులతో మాట్లాడుతున్న మాజీ మార్కెట్ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి

వాల్మీకిపురం,జూలై 31: ప్రతి నిరుపేద కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు శ్రమిస్తున్నారని వాల్మీకిపురం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలతో సమావేశమై చర్చించిన ఆయన మాట్లాడుతూ కార్యకర్తలంతా అధిష్ఠానం ఆదేశాల మేరకు నడుచుకోవాలని, పార్టీ కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం కల్పిస్తారన్నారు. గురువారం పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వాల్మీకిపురం పర్యటనకు వస్తున్నారని, మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, జిల్లా ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు పులి సత్యారెడ్డి, పీవీ నారాయణ, రాజేంద్రాచారి, వల్లిగట్ల రమణ, ద్వారకనాథరెడ్డి, శేషాద్రిరెడ్డి, చంద్రమౌళి, కోసూరి రమేష్, మురళి, బొక్కసం రామకృష్ణ, కువైట్ సయ్యద్ బాషా, చాను, గాంధీపేట రెడ్డి, సాదిక్, జంషీద్, కలందర్, సిద్దయ్య, సైదు, సాంబ, శీను, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

బి.కొత్తకోట, జూలై31: బి.కొత్తకోట మండలంలో ఆగస్టునెల పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ నూర్జహాన్ పేర్కొన్నారు. మండలానికి 8005 వుండగా వీరికి పంపిణీ కోసం రూ.5,46,26,500లు విడులయ్యాయన్నారు. లబ్ధిదారుల ఇళ్లవద్దకే సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు వచ్చి పింఛన్‌సొమ్ము అందిస్తారన్నారు.

పకడ్బందీగా పింఛన్‌ల పంపిణీ చేయాలి

పెద్దమండ్యం, జూలై 31: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ వెంకటరమణయ్య పేర్కొన్నారు. పెద్దమండ్యం ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ సకాలంలో వందశాతం పింఛన్‌ల పంపిణీ పూర్తి చేయాలన్నారు. పింఛన్ దారులు గ్రామాల్లో ఉండాలన్నారు. కార్యదర్శులు, జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులచే పెన్షన్ల పంపిణీ

పెద్దతిప్పసముద్రం జూలై 31: మండలంలో నేడు ఇళ్ల వద్దకే సచివాలయ సిబ్బంది పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మండలానికి 3కోట్ల 45 లక్షల15వేల ఐదు వందల రూపాయల నిధులను 20 సచివాలయాల ద్వారా సచివాలయ సిబ్బంది నేడు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

6729 మంది లబ్ధిదారులు...రూ.3 కోట్లు పంపిణీ

ములకలచెరువు, జూలై 31: మండలంలో గురువారం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరగనుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెండో నెల పింఛనును లబ్ధిదారులకు అందిచనున్నారు. సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ పోలప్ప బాధ్యతలు అప్పగించారు. పింఛన్ల పంపిణీ, పర్యవేక్షణకు మండల అధికారులను నియమించారు.

ఫింఛన్ల పంపిణీపై సూచనలు

తంబళ్లపల్లె, జూలై 31: లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా ఫింఛన్లను ఇంటి వద్దే పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ క్రిష్ణమూర్తి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఫింఛన్ల పంపిణీపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఉదయం 5:30ల నుంచే సచివాలయ సిబ్బందికి కేటాయించిన క్లస్టర్‌లలో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి లబ్ధిదారుల ఇంటి వద్దే పంపిణీ చేయాలన్నారు. ఎంఈఓ త్యాగరాజు, ఏఓ ఆనంద్‌కుమార్, ఈఓఆర్డీ దిలీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ గడ్డి విత్తనాలు పంపిణీ

పెద్దమండ్యం, జూలై 31: మండలంలో బుధవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ గడ్డి విత్తనాల పంపిణీ జరిగింది. పెద్దమండ్యం, వెలిగల్లు గ్రామాల్లో రైతులకు పశు వైద్యాధికారులు ఉస్మాన్, విక్రమ్‌రెడ్డి గడ్డి విత్తనాలు పంపిణీ జరిగింది. ప్రభుత్వం రైతులకు 75 శాతం సబ్సిడీతో 9 టన్నుల మొక్కజొన్న, 4 టన్నుల జొన్న గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. పశుగ్రాసం కొరత ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసేకోవాలన్నారు. తెలుగు యువత నేతలు గంగాధర, మహేశ్వర, రామాంజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టండి

- మురుగుకాల్వ నిర్మాణం చేపట్టాలి
- నాసిరకం పనులను నిలిపివేయాలి
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ధ్వజం



ప్రజా సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్తున్న కౌన్సిలర్ తులసి

మదనపల్లె టౌన్, జూలై 31: పట్టణ శివారు ప్రాంతాలు సహా పట్టణ నడిబొడ్డున చాలా ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా వుందని దీనిపై దృష్టి పెట్టాలని మున్సిపల్ కౌన్సిలర్ తులసి కోరారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో చైర్‌పర్సన్ మనూజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ పలు చోట్ల చెత్తతొట్టెలు పొర్లిపోతూ చెత్త రోడ్లపైకి వస్తోందన్నారు. ఇరుకు సందుల్లో చెత్తసేకరణ వాహనం వెళ్లలేక, ఇబ్బందులు పడుతున్నారని, దీనికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ ముబీనా మాట్లాడుతూ దొంతివీధిలో నిర్మిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్‌కు వాడుతున్న మెటీరియల్ నాసిరకంగా వుందని, సిమెంటు ఇటుకలు కింద పడితేనే పగిలిపోతున్నాయన్నారు. నాసిరకం పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని కౌన్సిలర్ నాగార్జునబాబు డిమాండ్ చేశారు. వారపు సంత వద్ద అన్నక్యాంటిన్ సమీపంలో ఆర్ఓ ప్లాంటు ఏర్పాటు చేయాలన్నారు. వైస్‌చైర్మన్ నూర్‌ఆజం మాట్లాడుతూ బెంగళూరు బస్టాండు, తారకరామా థియేటర్ వద్ద బాహుదానదిపై వున్న బ్రిడ్జిలను సుందరీకరించాలన్నారు. కౌన్సిలర్ ప్రసాదబాబు మాట్లాడుతూ మూడున్నరేళ్ల ప్రజల సమస్యలను కౌన్సిల్‌లో లేవనెత్తకుండా నోళ్లు కట్టేశారని, ఇప్పుడు స్వేచ్ఛ వచ్చిందన్నారు. ప్రతి నెలా 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆయా వార్డుల పరిధిలో ప్రజల సమస్యలను కౌన్సిలర్లు కమిషనర్ సహా తిరిగి సమస్యలను మున్సిపల్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కౌన్సిలర్ బీఏ ఖాజా మాట్లాడుతూ మున్సిపాలిటీలో వినియోగం లేని 10 ట్రాక్టర్, మిని జేసీబీ వాహనాలను స్క్రాప్ కింద జమ చేసి కేవలం రూ.1.93 లక్షలకే వేలం వేయాలని అజెండాలో పెట్టారని, దీనిపై పలు అనుమానాలు వున్నాయని ఆరోపించారు. ఈ వాహనాల వేలం నిలిపివేస్తూ కౌన్సిల్ డీసెంట్ ఇవ్వాలన్నారు. కౌన్సిలర్ ఫర్హానా మాట్లాడుతూ మున్సిపల్ జనరల్‌ఫండ్స్ నుంచి రూ.2.30 కోట్లు అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తే మిగిలిన చిన్నచిన్న పనులకు ఏ ఇబ్బందీ ఉండదన్నారు. చైర్‌పర్సన్ మనూజ మాట్లాడుతూ పట్టణంలో మార్కెట్‌యార్డు నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు, రామారావు కాలని నుంచి ఎస్‌బీఐ కాలని వరకు మురుగు కాల్వలు నిర్మించాల్సిన ఆవశ్యకత వుందన్నారు. ఆర్టీసీ బస్టాండు వెనుక అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆటో స్టాండ్ వరకు వర్షం వస్తే నీరు నిల్వ లేకుండా సీసీ రోడ్డు ఎత్తు పెంచాల్సిన అవసరం వుందన్నారు. దీని కోసం జనరల్ ఫండ్స్ ఉపయోగిస్తున్నామన్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం, దోమల నివారణకు, ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, డీఈ శ్రావణి, ఏఈలు స్నేహప్రియ, శిరీషా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, జూలై 31: ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాలూకా పోలీసులు అందించిన వివరాల్లోకెళితే... కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ, రామిగానిపల్లె వాసి మధుసూదన్‌రెడ్డి కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి తిరుపతిలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు చెప్పారు. చదువుపై ఆసక్తి లేకే బలన్మరణం చెందినట్లు మృతుడి తల్లిదండ్రులు తెలిపారు. కాగా సీటీఎం క్రాస్ పంచాయతీ రైల్వే రోడ్డు సమీపంలో చెటుకు ఉరివేసుకున్న విషయాన్ని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మదనపల్లె తాలుకా పోలీసులు వివరాలను సేకరించారు. అనంతరం నవీన్‌కుమార్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అనంతరం మృతుడి తండ్రి ఫిర్యాదుపై సీఐ శేఖర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా గంగమ్మ జాతర



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

రామసముద్రం, జూలై 31: మండల కేంద్రంలో బుధవారం గంగజాతర ఘనంగా నిర్వహించారు. వాల్మీకి వీధిలో వెలసిన తిరుపతిగంగమ్మ అమ్మవారు, దుర్గమ్మ కాలనీ వాసులు భక్తి శ్రద్ధలతో బోణాలు సమర్పించారు. గుంతలపేట సమీపంలో వెలసిన చౌడేశ్వరిదేవి, ఎం.కొత్తూరులో వెలసిన తిరుపతి గంగమ్మ అమ్మవారికి పట్టుచీర, సారె, పసుపు, కుంకుమ సమర్పించారు. మహిళలు ఉపవాస దీక్షలతో దీలు, బోణాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి పల్లకిని పలు రకాల పుష్పాలతో అలంకరించి అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. ఈవేడుకలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



కాల్వను శుభ్రం చేస్తుయిన్న సర్పంచ్ లక్ష్మీప్రసన్న

కలకడ, జూలై 31: గ్రామంలో ప్రజలు రోగాల బారిన పడకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు కదిరాయచెరువు సర్పంచ్ లక్ష్మీప్రసన్న తెలిపారు. గ్రామ స్వచ్ఛత కోసం నేను సైతం కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్మికులతో కలిసి ఆమె హైస్కూల్ వద్ద మురుగునీటి కాల్వలను శుభ్రం చేశారు. విద్యార్థులకు పరిసరాల శుభ్రతపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరైన యాజమాన్యంతో మంచి దిగుబడి

కలకడ, జూలై 31: వేరుశనగ పంటలో సరైన యాజమాన్య పద్ధతులను పాటించడం వలన మంచి దిగుబడిని సాధించవచ్చని వాల్మీకిపురం ఏడీఏ వాణిశ్రీ అన్నారు. దేవళపల్లెలో బుధవారం ఆమె పొలం బడి నిర్వహించి వారికి సాగులో మెలకువలను నేర్పించారు. ఆమె మాట్లాడుతూ వేరుశనగలో విత్తనశుద్ధి చేయడం వలన పంట ఆశించే తెగుళ్లను నివారించవచ్చన్నారు. అంతర పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చన్నారు. భూసార పరీక్షల ఆధారంగా రసాయనిక ఎరువులను వాడాలని సూచించారు. వానపాము, సేంద్రియ ఎరువులు, మిత్రపురుగుల ఉపయోగాల గురించి వివరించారు. అనంతరం పొలాలను పరిశీలించి సలహా, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఏఓ లావణ్య, సిబ్బంది రెడ్డికుమార్, శివకుమార్, రాజేంద్రబాబు పాల్గొన్నారు.

డయేరియా పట్ల అప్రమత్తంగా వుండండి

బి.కొత్తకోట, జూలై31: డయేరియా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని నగర పంచాయతీ కమిషనర్ పీఆర్ మనోహర్ కోరారు. స్టాప్ డయేరియా ప్రోగ్రాంలో భాగంగా తాకాటంవారిపల్లె మార్గంలో జరుగుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం, నివాసగృహ పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలని సూచించారు.

అక్రమకట్టడాల తొలగింపు



ఎక్సవేటర్‌తో తొలగిస్తున్న అక్రమ కట్టడాలు

మదనపల్లె టౌన్, జూలై 31: స్థానిక కదిరిరోడ్డులోని అమ్మచెరువుమిట్ట వద్ద ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అమ్మచెరువుమిట్ట వద్ద జరిగిన ఓ కార్యక్రమానికి వెళ్లినప్పుడు స్థానికులు అక్రమ కట్టడాలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసిన ఎమ్మెల్యే అక్రమ కట్టడాలపై విచారించి, నిజమని తేలితే తొలగించాలని ఆదేశించారు. ఈ క్రమంలో రెవెన్యూ సిబ్బంది అక్కడికి వెళ్లి విచారించి ప్రభుత్వ భూమిలో నిర్మించిన రెండు కట్టడాలను ఎక్సవేటర్‌తో తొలగించారు.

బైక్, బొలెరో ఢీ- ఒకరికి గాయాలు

తంబళ్లపల్లె, జూలై 31: ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీ కొనడంతో లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలం ఏటిగడ్డతండా వాసి లక్ష్మీదేవి అల్లుడు నాగేష్‌తో కలసి సొంత పనుల నిమిత్తం బుధవారం ద్విచక్ర వాహనంలో తంబళ్లపల్లెకు వచ్చారు. ఈ క్రమంలో వీరు ప్రభుత్వాస్పత్రి ముందు రహదారిపై వెళ్తుండగా..అదే దారిలో వెళ్తున్న బొలెరో వాహనం వీరిని ఢీ కొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవి తలకు తీవ్ర గాయమై రక్తస్రావమవగా అపస్మారక స్థితికి చేరుకుంది. స్థానికులు బాధితురాలిని ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. తలకు తీవ్ర గాయమై స్కానింగ్ అవసరమవడంతో మదనపల్లెకు రెఫర్ చేశారు.

ట్రాన్స్‌కో ఈఈగా చంద్రశేఖర్ రెడ్డి



ఈఈ చంద్రశేఖర్ రెడ్డిని అభినందిస్తున్న సిబ్బంది

పీలేరు, జూలై 31: ఏపీ ట్రాన్స్‌కో పీలేరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)గా వై.చంద్రశేఖర రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. పీలేరు ఈఈగా పనిచేస్తున్న మునిచంద్ర ఇటీవల చిత్తూరుకు బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రభుత్వం చంద్రశేఖర్ రెడ్డిని నియమించింది. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. పీలేరు, పుంగనూరు డివిజన్‌లోని ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది ఆయనను అభినందించారు.

కోత అనంతరం కొమ్మ కత్తిరించాలి

కలికిరి, జూలై 31: మామిడిలో పంట కోత పూర్తయిన రెండు వారాల తరువాత కొమ్మల కత్తిరింపులు చేపట్టాలని కేవీకే శాస్త్రవేత్త ఎ.శ్రీనివాసులు తెలిపారు. కొమ్మల కత్తిరింపులు పూర్తయిన అనంతరం లీటరు నీటికి యూరియా 20 గ్రాములతో 5 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. దీంతో కొత్త చిగుళ్ళు విస్తృతంగా వస్తాయని తెలిపారు. కాయలు కోత అనంతరం ఈ విధానాన్ని పాటించి పిచికారీ కూడా పూర్తి చేస్తే మామిడి చెట్లలో త్వరగా పూత వచ్చే అవకాశాలు కూడా వున్నాయని వివరించారు. గుండ్లూరు, అశిపిరెడ్డిగారిపల్లెలోని పలువురు రైతుల మామిడి తోటలను శ్రీనివాసులు పరిశీలించారు. మామిడిలో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. తొలకరి వర్షాలకు తోటలో దున్నకాలు చేపట్టాలని, తిరిగి కలుపు పెరగకుండా పచ్చి రొట్ట పంటలైన జీలుగు, జనుము, పిల్లిపెసర, ఉలవల వంటి అంతర పంటలను సాగుచేయాలని కోరారు. ఎకరాకు 15 కిలోల విత్తనాలు వాడాలన్నారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు రసాయనిక, సేంద్రీయ ఎరువులను చెట్ల పాదుల ద్వారా అందజేయాలని చెప్పారు.

పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

5న రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఆందోళనలను విజయవంతం చేయండి

- ఏపీ రైతు సంఘం రాష్ట్రఅధ్యక్షుడు ఈశ్వరయ్య



మదనపల్లె అర్బన్, జూలై 31: రాష్ట్ర వ్యాప్తంగా అన్నిరకాల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఎన్వీఆర్ కల్యాణమండపంలో మూడో రోజు ఏపీ రైతు సంఘం రాష్ట్ర స్థాయి సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై మూడు రోజులు రాష్ట్రస్థాయి సమ్మేళనం ద్వారా చర్చ జరిగిందన్నారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత తెచ్చిన మూడు నల్ల చట్టాలు రద్దు చేయాలని రైతాంగం చేసిన పోరాటాలతో రైతాంగ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం ఇంతవరకూ అమలు చేయలేదని ఆరోపించారు. ఇటీవల ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రైతాంగానికి నిధులు కేటాయించ లేదని విమర్శించారు. ఏటా వ్యవసాయ రంగానికి కేటాయించే నిధులు తగ్గిపోయి రైతులు నష్టపోతున్నట్లు వాపోయారు. రాష్ట్రంలో కృష్ణ, గోదావరి జలాల వినియోగంలో బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం అమలు చేయలేదన్నారు. ఆగస్టు 5న రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు నిర్వహిస్తున్న కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘాల నేతలతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాసిరకం విత్తనాలతో రాష్ట్రంలో బొప్పాయి రైతులు నష్టపోయారని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మే నర్సరీలపై, ఫర్టిలైజర్స్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు, ఇతర సాగు, తాగునీటి ప్రాజెక్టులు త్వరిత గతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఆఫీస్ బేరర్స్ జగన్నాథం, రామచంద్రయ్య, కాటమయ్య, రామానాయుడు, మల్లికార్జున, అప్పలనాయుడు, జమలయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమాళ్ల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె డీఎస్పీగా దర్బార్ కొండయ్యనాయుడు



మదనపల్లె టౌన్, జూలై 31: మదనపల్లె డీఎస్పీగా దర్బార్ కొండయ్యనాయుడును నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో బుధవారం 96 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా మదనల్లె డీఎస్పీగా పనిచేస్తున్న ప్రసాదరెడ్డిని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో వెయిటింగ్‌లో ఉన్న దర్బార్ కొండయ్యనాయుడును మదనపల్లె డీఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

కుక్కల దాడిలో 22 గొర్రెలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

గుర్రంకొండ, జూలై 31: గొర్రెల గుంపులపై వీధి కుక్కలు దాడి చేయడంతో 22 గొర్రెలు మృతి చెందినట్లు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం ఉదయం జరిగింది. గుర్రంకొండ పంచాయితీ దౌలత్‌ఖాన్‌పల్లెకు చెందిన గుర్రం. సరోజ గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 8 గంటలకు గొర్రెల మందను స్థానిక కరెంట్ సబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న దొడ్డిలోకి తోలి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో గొర్రెల మందపై వీధి కుకలు దాడి చేశాయి. ఈ కుక్కల దాడిలో 22 గొర్రెల మృతి చెందగా, 14 గొర్రెలు గాయపడినాయి. గమనించిన స్థానికులు కుక్కల గుంపును తరిమేయడంతో వెళ్లిపోయాయి. లేదంటే మరికొన్ని గొర్రెలు మృతి చెందేవని బాధిత మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆమె కోరుతుంది.

నేటి నుంచి ఉర్దూ టెట్‌కు ఉచిత శిక్షణ

మదనపల్లె అర్బన్, జూలై 31: మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి టీచర్ ఎలిజిబిలిటీ టెస్టు (టెట్)కు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు కో- ఆర్డినేటర్ షాజహాన్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారని తెలిపారు. స్థానిక మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో ఉదయం 9 గంటలకు హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. నేటి నుంచి సెప్టెంబర్ 15 వరకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉచితంగా స్టడీమెటీరియల్ కూడా ఉచితంగా అందిస్తామన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయండి

సీఎం చంద్రబాబుకు శ్రీరామ్‌చినబాబు వినతి

మదనపల్లె టౌన్, జూలై 31: వైసీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా తెలుగు యువత, టీడీపీ నేతలపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీఎం చంద్రబాబును తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు కోరారు. బుధవారం సచివాలయంలో చంద్రబాబును ఆయన కలిశారు. ఆయన వెంట టీడీపీ నేత లోహిత్‌పాల్గొన్నారు.

అధ్యాపకురాలు భవానిదేవికి పీహెచ్‌డీ



మదనపల్లె టౌన్, జూలై 31: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బోటనీ అధ్యాపకురాలు భవానిదేవికి ద్రవిడ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రకటించిందని ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. ద్రవిడవర్సిటీలో ప్రొఫెసర్ సి.వరదరాజులు ఆధ్వర్యంలో భవానిదేవి 'ఎల్‌సీ-ఎంఎస్ అనాలైసిస్ ఆఫ్ ఫైటోకెమికల్స్ అండ్ యాంటీ మైక్రోబియాల్ పొటెన్షియల్ ఇన్ డిఫరెంట్ పార్ట్స్ ఆఫ్ సెలెక్టెడ్ మెడిసినల్ ప్లాంట్స్' అంశంపై పరిశోధనలు జరిపారు. ఇందులో భాగంగా బుధవారం భవానిదేవికి పీహెచ్‌డీ అవార్డు ప్రకటిస్తూ యూనివర్శిటీ ఎగ్జామినేషన్ కంట్రోలర్ నోటిఫికేషన్ జారీ చేశారు.

వేరుశనగలో బెట్ట నివారణకు చర్యలు

నిమ్మనపల్లి, జూలై 31: మండలంలో వేరుశనగ పంటలు వేసిన రైతులకు వర్షాభావంతో వేరుశనగ చెట్లు ఎండిపోతుంటే తీసుకోవాల్సిన జాగ్రత్త గురించి ఏఓ మురళీ మోహన్ తెలియజేశారు. మండలంలో 820ఎకరాల్లో రైతులు వేరుశనగ పంటను పండించారన్నారు. ప్రస్తుతం వర్షం రాకపోవడంతో చెట్లు ఎండిపోయే పరిస్థితి నెలకొందని తెలిపారు. దీనిని అధిగమించేందుకు యూరియా కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. లీటరు నీటిలో 20గ్రాముల యూరియాను కలిపి బెట్టకు పిచికారీ చేస్తే 10రోజుల వరకు పంటను కాపాడ వచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల వేరుశనగ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు పీలేరులో ఎమ్మెల్యే పర్యటన

పీలేరు, జూలై 31: పెన్షన్ల పంపిణీ కోసం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పీలేరులో పర్యటించనున్నారని ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 9.45 గంటలకు లక్ష్మీపురం కాలనీ, అజంతా టాకీసు మిట్ట, ఆ తరువాత మొడల్ కాలనీలో ఆయన స్వయంగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తారని ఆయన తెలిపారు. 11 గంటలకు స్థానిక పంచాయతీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కాగా మండలంలో ఉన్న 9842 పింఛన్లు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేశామని, లబ్దిదారులు ఇంటి వద్దనే ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జనావాసాల నడుమ విష సర్పం..



రక్తపింజరి పాము పట్టుకున్న సింగమలై

వాల్మీకి పురం, జూలై 31: పట్టణంలో బుధవారం ఉదయం జనావాసాల నడుమ విష సర్పం భయాందోళనలకు గురి చేసింది. స్థానిక హసన్‌ఖాన్ వీధిలో ఉదయం నివాసాల మధ్యకు రక్తపింజరి పాము రావడంతో జనం పరుగులు తీశారు. చివరికి పాములు పట్టే వాల్మీకినగర్‌కు చెందిన సింగమలై అనే వ్యక్తిని పిలిపించి పామును పట్టి అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు.